

డాక్టర్లే నా భర్తను చంపేశారు

- మృతుడి భార్య ఆరోపణ
- ఈశ్వరయ్య మృతిపై కమిటీ విచారణ
- డ్యూటీ డాక్టర్ నిర్లక్ష్యాన్ని పట్టించిన కేస్ షీట్



ఈశ్వరయ్య మృతిపై విచారిస్తున్న కమిటీ సభ్యులు, సీనియర్ వైద్యులు ఆత్మారామ్, నవీన్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 2: జిల్లా సర్వజన ఆస్పత్రిలో ఈశ్వరయ్య మృతిపై త్రిసభ్య కమిటీ సోమవారం విచారణ చేపట్టింది. గత నెల 27న తాడిపత్రికి చెందిన ఈశ్వరయ్యను చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చారు. అదే రోజు రాత్రి ఆయన చనిపోయారు. డాక్టర్లు, నర్సులు పట్టించుకోకపోవడం వల్లే ఈశ్వరయ్య మృతి చెందాడని కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు ముగ్గురు సీనియర్ డాక్టర్లతో కమిటీని ఏర్పాటు చేసి విచారణకు ఆదేశించారు. విచారణాధికారులైన వైద్యులు ఆత్మారామ్, నవీన్‌కుమార్, రామస్వామినాయక్.. ఆర్ఎంఓ ఆఫీస్‌లో విచారణ చేపట్టారు. మృతుడి భార్య పద్మావతి, ఆరోజు ఆస్పత్రిలో ఉన్న మృతుడి కుమార్తెలు, ఇతర కుటుంబ సభ్యులను పిలిపించి విచారించారు.

ఒక్క మందు కూడా వాడలేదు: మృతుడి భార్య

మృతుడి భార్య పద్మావతి మాట్లాడుతూ.. ఆరోజు ఉదయం 8నుంచి 9గంటల మధ్యన అడ్మిషన్ పొందామన్నారు. 12-45సమయంలో ఉదయం డ్యూటీ డాక్టర్ పద్మజ వచ్చి పరీక్షించి సెలైన్ ఎక్కించాలని, మందులు వాడాలని రాసిచ్చారని తెలిపారు. కొన్నిమందులు ఇక్కడలేవు బయట తెచ్చుకోమని చెప్పి చీటి రాసిచ్చినట్లు తెలిపారు. తాము బయటకు వెళ్లి మెడికల్ షాపులో కొనుక్కొచ్చామని, తర్వాత ఎవరో వచ్చి పరీక్ష కోసం రక్తం తీసుకెళ్లారని అన్నారు. ఇక్కడున్న డాక్టర్లు, నర్సులు ఎవరూ సెలైన్ ఎక్కించలేదని, సూది మందులు వేయలేదని, కనీసం బయట తెచ్చిన మందులు కూడా వాడలేదని కమిటీ సభ్యులకు వివరించారు. ఏదో ఒక సూది నరాలకు వేయాలని చూశారని, నరాలు దొరకలేదని వెళ్లిపోయారని అన్నారు. మళ్లీ ఎవరూ పట్టించుకోలేదని అన్నారు. సాయంత్రం ఆరు గంటల నుంచి తన భర్త పరిస్థితి సీరియస్‌గా ఉందని అక్కడ ఉన్న డాక్టర్లు, నర్సుల వద్దకు వెళ్లి ప్రాధేయపడినా ఎవరు పట్టించుకోలేదని అన్నారు. 'డాక్టర్లే మా ఆయనను చంపేశారు. మేము బీదోళ్లం. ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. నామొగుడు చనిపోయాడు ఇంక ఎలా బతికేది?' అని కన్నీటిపర్యంతమయ్యారు.

డ్యూటీ డాక్టర్‌ను అడ్డంగా పట్టించిన కేస్ షీట్

కమిటీ సభ్యులు ఈశ్వరయ్య కేస్ షీట్‌ను తెప్పించి పరిశీలించారు. మధ్యాహ్నం రెండు గంటలకు డ్యూటీ డాక్టర్ నరసింహారెడ్డి ఎంఎం వార్డుకు వచ్చారు. పేషెంట్ రాత్రి 9-30 గంటలకు చనిపోయారు. అప్పటివరకు డ్యూటీ డాక్టర్ పేషెంట్‌వద్దకే వెళ్లలేదు, చూడలేదు. నిబంధనల మేరకు డ్యూటీ డాక్టర్ వచ్చిన వెంటనే వార్డులో ఏయే పేషెంట్స్ ఉన్నారో వారి వద్దకు వెళ్లి పరీక్షించి అవసరమైన మందులు, ఇతర ట్రీట్‌మెంట్‌కు సంబంధించి కేస్ షీట్‌లో రాయాలి. దానిప్రకారం పీజీ డాక్టర్లు, హౌస్‌సర్జన్‌లు పేషెంట్‌కు చికిత్స అందించాల్సి ఉంటుంది. ఇక్కడ అది జరగలేదు కాబట్టి డ్యూటీ డాక్టర్ ఈశ్వరయ్యను పరీక్షించలేదని స్పష్టమైంది. ఉదయం వచ్చిన డ్యూటీ డాక్టర్ పద్మజ పేషెంట్‌ను చూసి మందులు రాసినా, ఆమేరకు పేషెంట్‌కు వైద్యం అందించలేదని మిగిలిన మందులను బట్టి అర్థమవుతోంది. మధ్యాహ్నం డ్యూటీలో ఉన్న పీజీ డాక్టర్ మాత్రం చనిపోయిన తర్వాత కామెర్ల వల్లేనని కేస్ షీట్‌లో రాశారు. ఈశ్వరయ్య మృతికి డాక్టర్లు, వైద్యసిబ్బంది నిర్లక్ష్యమే కారణమని తెలుస్తోంది. నివేదికను సూపరింటెండెంట్‌కు అందజేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రైవేట్ ఫిట్‌నెస్..!

- వాహనాల ఫిట్‌నెస్ నిర్ధారణకు ఏఎఫ్ఎంఎస్
- శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్‌కు నిర్వహణ బాధ్యతలు
- జిల్లాలోని అన్ని వాహనాలు అక్కడికి వెళ్లాల్సిందే..!
- చలానాలు కొత్త సైట్‌లో కట్టాలి.. కానీ ఆప్షన్ లేదు
- పాత సైట్‌లో కడితే.. సొమ్ము పోయినట్లే
- కొత్త పద్ధతిపై అవగాహన కల్పించని ఆర్టీఏ అధికారులు



వాహనాల ఫిట్‌నెస్‌ను పరీక్షించే పరికరాలు



వాహనాల ఫిట్‌నెస్ పరీక్ష చేసే ట్రాక్

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 2: వాహనాల ఫిట్‌నెస్ పరీక్షల నిర్వహణ బాధ్యతను ప్రైవేటు ఏజెన్సీ.. శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్‌కు అప్పగించారు. ఈ సంస్థ కేంద్రాన్ని జాతీయ రహదారి పక్కన.. రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లి పరిధిలో, అయ్యవారిపల్లికి వెళ్లే దారిలో ఏర్పాటు చేశారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఆటోమేటెడ్ ఫిట్‌నెస్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఏఎఫ్ఎంఎస్) అమలులోకి వచ్చింది. కానీ ఇప్పటి దాకా కొత్త సైట్‌లో వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం చలానా కట్టేందుకు ఆప్షన్ ఇవ్వలేదు. దీంతో కొత్తగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కావాల్సినవారు, రెన్యువల్ చేసుకోదలచినవారు చలానా కట్టలేని పరిస్థితి నెలకొంది. ప్రైవేటు ఏజెన్సీకి ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహణ బాధ్యతలు అప్పగించిన తర్వాత, కొత్త సైట్‌లో చలానా కట్టాలన్న విషయాన్ని సంబంధిత అధికారులు, ప్రైవేటు ఏజెన్సీ నిర్వాహకులు క్షేత్రస్థాయిలో ప్రచారం చేయలేదు. దీనిపై ఎవరికీ అవగాహన లేనట్లు సమాచారం. చలానా కట్టేందుకు ఆప్షన్ ఎప్పుడిస్తారో కొత్త సైట్‌లో సమాచారం ఇవ్వలేదు. దీంతో ఏం చేయాలో తెలియక వాహనదారులు అయోమయంలో పడ్డారు.

పాత చలానాలు అంతేనా..?

జిల్లాలో సుమారు 15 మంది వాహనదారులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం పాత సైట్‌లో చలానాలు కట్టారు. అనంతపురం ఆర్టీఏ కార్యాలయానికి సుమారు పది మంది వాహనదారులు సోమవారం వెళ్లారు. ఇక నుంచి ఆర్టీఏ కార్యాలయంలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం పరీక్ష చేయరని, శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ కేంద్రానికి వెళ్లాలని కార్యాలయ సిబ్బంది వారికి సూచించారు. దీంతో వాహనదారులు ఆ కేంద్రం వద్దకు వెళ్లినా, ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. పాత వాహన్ సైట్‌లో చలానాలు కడితే తమ సైట్‌లో చూపించవని, కొత్త సైట్‌లో చలానాలు కడితేనే ఇక్కడ పరీక్ష చేస్తామని నిర్వాహకులు స్పష్టం చేశారు. దీంతో వాహనదారులు తిరిగి ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లారు. కొత్త సైట్ గురించి తమకు ఎలాంటి సమాచారం లేదని, వాహన్ యాప్‌లోని సైట్‌లో చలానా కట్టామని అధికారులకు చెబితే.. తామేమీ చేయలేమని ఓ అధికారి చేతులెత్తేసినట్లు తెలిసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొత్త సైట్‌లోనే చలానాలు కట్టాలని, ఇప్పటికే కట్టినవాటి గురించి తాము ఏమీ చేలేమని బదులిచ్చినట్లు సమాచారం.

ఏజెన్సీ వద్దకు వెళ్లాల్సిందే..

అనంతపురం, తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం ఆర్టీఏ కార్యాలయ పరిధిలోని అన్ని రకాల వాహనాలకు గతంలో ఆయా ఆర్టీఏ కార్యాలయాల్లోనే ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించేవారు. కానీ ఇకపై జిల్లాలోని అన్ని రకాల వాహనదారులు రాప్తాడు సమీపంలోని శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ ఏజెన్సీ కేంద్రానికి వెళ్లాల్సిందే. అక్కడ ఆటోమెటెడ్ ఫిట్‌నెస్ మేనేజ్‌మెంట్ సిస్టం(ఏఎఫ్ఎంఎస్) ద్వారా 15 రకాల పరికరాలతో వాహనాల ఫిట్‌నెస్‌ను పరీక్షిస్తామని ఏజెన్సీ నిర్వాహకులు అంటున్నారు. వాహనం ఫిట్‌గా ఉన్నట్లు ఆ పరీక్షల ద్వారా నిర్ధారణ అయితేనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. లేదంటే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ కాదు.



శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ ఆటోమేటెడ్ ఫిట్‌నెస్ టెస్టింగ్ కేంద్రం

ఆర్టీఏకి సంబంధం లేదు..

ఆర్టీఏ కార్యాలయాల్లో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు స్వయంగా వాహనాలను పరీక్షించి, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేసేవారు. వాహనాల ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహణ, సర్టిఫికెట్ జారీ బాధ్యతలను ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించడంతో ఇక నుంచి ఆర్టీఓ అధికారులకు వాటితో సంబంధం లేకుండా పోయింది. ప్రైవేటు ఏజెన్సీ ఆధ్వర్యంలో జరిగే ఫిట్‌నెస్ పరీక్షల పర్యవేక్షణ బాధ్యతలను ఆర్టీఏ అధికారులకు అప్పగించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రైవేటు ఏజెన్సీలపై ఆర్టీఏ అధికారుల పర్యవేక్షణ ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

ఇక అక్కడికే వెళ్లాలి..

జిల్లాలోని వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహణ, సర్టిఫికెట్ జారీ బాధ్యతలను ప్రభుత్వం శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ ఏజెన్సీకి అప్పగించింది. ఇకపై ఆర్టీఏ కార్యాలయాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం రావాల్సిన అవసరం లేదు. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఫిట్‌నెస్ పరీక్షల బాధ్యత ఏజెన్సీకి వెళ్లింది. ఇక నుంచి జిల్లాలోని అన్ని రకాల వహనాలను ఫిట్‌నెస్ పరీక్ష కోసం ప్రైవేటు ఏజెన్సీ కేంద్రానికి తీసుకువెళ్లాలి. అక్కడ ఆటోమెటెడ్ ఫిట్‌నెస్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా వాహనాల ఫిట్‌నెస్‌ను పరీక్షిస్తారు. కొత్త సైట్‌లోనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం చలానా కట్టాలి. పాత సైట్‌లో చలానాలు కడితే ప్రయోజనం ఉండదు.

-వీర్రాజు, జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి

టీచర్లు వస్తున్నారా.. లేదా?

డీఈఓను ప్రశ్నించిన కలెక్టర్

గుమ్మఘట్ట మండలంలో హాజరు తక్కువపై ఆగ్రహం

అనంతపురం టౌన్, సెప్టెంబరు 2: ఉపాధ్యాయుల ముఖ హాజరు గుమ్మఘట్ట మండలంలో ఎందుకు తక్కువ నమోదవుతోందని డీఈఓను జిల్లా కలెక్టరు వినోద్ కుమార్ ప్రశ్నించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన అధికారుల సమీక్షలో టీచర్ల హాజరుపై కలెక్టరు ఆరా తీశారు. గుమ్మఘట్ట మండలంలో ఎంతమంది టీచర్లు ఉన్నారో, ఎంతమంది ముఖహాజరు వేస్తున్నారో లెక్కలు చెబుతూ కలెక్టరు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడ ఎంఈఓలు లేరా అని ప్రశ్నించగా, ఇద్దరు ఉన్నారని డీఈఓ సమాధానమిచ్చారు. వారు అక్కడ డ్యూటీ చేస్తున్నారా.. లేదా అని కలెక్టరు మండిపడ్డారు. పదేపదే చెప్పించుకోకుండా టీచర్ల హాజరు శాతం పెంచాలని, లేకపోతే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టరు హెచ్చరించారు.

చిత్తశుద్ధితో భూసేకరణ చేపట్టండి



మాట్లాడుతున్న కలెక్టర్

జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి భూసేకరణ పనులను చిత్తశుద్ధితో చేపట్టాలని అధికారులను కలెక్టరు ఆదేశించారు. జాతీయ రహదారులు, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఏపీ ట్రాన్స్‌కో, రైల్వే, పరిశ్రమలకు సంబంధించిన భూసేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈవిషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఆర్డీఓలు, తహసీల్దార్లు, సంబంధిత ఇతర శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో డీఆర్ఓ రామకృష్ణారెడ్డి, ఆర్డీఓలు శ్రీనివాసులురెడ్డి, రాణి సుష్మిత, హైవే డీఈ రామచంద్రారెడ్డి, విద్యుత్ ఎస్ఈ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

మట్టి వినాయకుడినే పూజిద్దాం

మట్టివినాయకుడిని పూజిద్దాం...పర్యావరణాన్ని పరిరక్షిద్దామని ప్రజలకు కలెక్టరు పిలుపునిచ్చారు. కాలుష్యనియంత్రణ మండలి ఆధ్వర్యంలో సోమవారం ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆయన విడుదల చేశారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ వినాయకచవితి భక్తిశ్రద్ధలతో జరుపుకుందామని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు సహజమైన రంగులతో తయారు చేసిన మట్టి వినాయకులను కొలువుదీర్చి పూజిద్దామని అన్నారు. ఈనెల 6న మట్టివినాయకుల తయారీని నగరంలోని శారదా మున్సిపల్‌స్కూల్‌లో నిర్వహిస్తున్నారని, ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని కలెక్టరు సూచించారు. కార్యక్రమంలో డీఆర్ఓ రామకృష్ణారెడ్డి, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ పాల్గొన్నారు.

అయినవారికి ఆకుల్లో..!

- రీ ప్యాట్రియేషన్‌లో ఇద్దరిపై అతిప్రేమ
- మరో ముగ్గురికి పాత స్థానాలే
- ఒకరికి ప్లేస్ పెండింగ్
- 'గాలిలో గురువుల'కు మోక్షం



అనంతపురం విద్య, సెప్టెంబరు 2: నెలరోజులకు పైగా గాలిలో ఉన్న గురువులకు మోక్షం లభించింది. సమగ్రశిక్ష ప్రాజెక్టు నుంచి రీ ప్యాట్రియేషన్ అయిన టీచర్లకు ప్లేసులు కేటాయిస్తూ సోమవారం మధ్యాహ్నం డీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. నెల రోజుల కిందట ప్రాజెక్టు నుంచి ఏడుగురు ఉపాధ్యాయులను విద్యాశాఖకు రీ ప్యాట్రియేషన్ చేశారు. అయితే పలు కారణాలు చూపుతూ జిల్లా విద్యాశాఖ అధికారులు వారికి ప్లేసులు ఇవ్వకుండా నాన్చుతూ వచ్చారు. ప్రాజెక్టులో ఉంచకుండా, స్కూళ్లకు పంపకుండా డీఈఓ ఆఫీస్‌కు రప్పించి సంతకాలు పెట్టించుకుని పంపుతూ వచ్చారు. దీంతో 'గాలిలో గురువులు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో గత నెల 27న కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్, డీఈఓ ఎట్టకేలకు సంబంధిత ఉపాధ్యాయులకు ప్లేసులు కేటాయించారు. అయితే వారిలో కొందరు టీచర్లను ఏ స్కూల్ నుంచి వచ్చారో అదే స్కూల్‌కు పంపగా, మరికొందరిపై అతి ప్రేమ చూపించి జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ప్లేసులు ఇవ్వడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అయినవారికో న్యాయం...మాకో న్యాయమా అంటూ ఇతర టీచర్లు ప్రశ్నిస్తున్నారు.

ఆ ఇద్దరిపై ప్రేమ ఎందుకో..?

ఇటీవలి వరకూ సమగ్రశిక్ష ప్రాజెక్టులో ఇన్‌చార్జ్ సీఎంఓగా పని చేసిన గోపాలకృష్ణ గతంలో విడపనకల్లు మండలం హావళిగి జడ్పీ హైస్కూల్‌లో పనిచేశారు. ప్రాజెక్టు నుంచి రీ ప్యాట్రియేషన్ అయిన ఆయనకు అదే స్కూల్‌కు పోస్టింగ్ ఇవ్వాలి. అక్కడ ప్లేస్ లేకుంటే అదే మండలంలోని మరో స్కూల్ కేటాయించాలి. కానీ ఆ మండలంలో ఎక్కడా ప్లేస్‌లు లేవన్నట్టుగా అనంతపురానికి దగ్గరలోని శింగనమల మండలానికి ఇచ్చారు. దీనిపై అనేక విమర్శలు వస్తున్నాయి. అసిస్టెంట్ ఏఎంఓగా పనిచేస్తున్న చంద్రమోహన్ రెడ్డి గతంలో ఉరవకొండ మండలంలోని వ్యాసాపురంలో పనిచేసే వారు. ప్రాజెక్టు నుంచి రీ ప్యాట్రియేషన్ చేసిన తర్వాత ఆయనకు అదే ప్లేస్ ఇవ్వాల్సి ఉంది. అయితే అక్కడ ప్లేస్ ఖాళీ లేకపోవడంతో అదే మండలంలోని మోపిడి స్కూల్‌కు కేటాయించారని సమాచారం. మరో అసిస్టెంట్ ఏఎంఓ మాధవరెడ్డి డీ.హీరేహాళ్ మండలం కడలూరు నుంచి వచ్చారు. ఆయన్ను అదే మండలానికి పంపాలి. కానీ జిల్లాకేంద్రానికి సమీపంలోని రాప్తాడు మండలం హంపాపురం స్కూల్‌కు పోస్టింగ్ ఇచ్చారు. దీనిపై భారీగా విమర్శలు వస్తున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి ప్రాజెక్టులోకి వచ్చిన గోపాలకృష్ణ, మాధవరెడ్డిలకు రీప్యాట్రేషన్‌లో భాగంగా, నిబంధనలకు విరుద్ధంగా జిల్లా కేంద్రానికి సమీప స్థానాలు ఎలా కేటాయిస్తారని పలువురు ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై వివరణ కోసం డీఈఓ వరలక్ష్మికి ఫోన్ చేయగా ఆమె అందుబాటులోకి రాలేదు.

వారికి పాత స్థానాలే...

ప్రాజెక్టులో ఏఎంఓగా పని చేసిన చంద్రశేఖర్‌రెడ్డి గతంలో డీ.హీరేహాళ్ మండలం దేవగిరి నుంచి వచ్చారు. రీ ప్యాట్రియేషన్ తర్వాత ఆయనకు అదే స్కూల్‌కు పోస్టింగ్ ఇచ్చారు. ఏఎస్ఓగా వచ్చిన రాంప్రసాద్‌రెడ్డి డీ.హీరేహాళ్ మండలంలోని శ్రీధర్‌ఘట్ట స్కూల్ నుంచి రాగా, ఇప్పుడు తిరిగి అక్కడికే పంపారు. ఇన్‌చార్జ్ అలెల్కోగా పనిచేస్తున్న గోవిందరెడ్డి బెళుగుప్ప జడ్పీ హైస్కూల్ నుంచి వచ్చారు. ఇప్పుడు ఆయనను అదే స్కూల్‌కు పంపారు. ఈ ముగ్గురికి పాత స్థానాలు ఇచ్చి ఇద్దరికి మాత్రం జిల్లా కేంద్రానికి దగ్గరిలోని స్కూళ్లకు నియమించడంపై అనేక విమర్శలు వస్తున్నాయి. ప్రాజెక్టులో జీసీడీఓగా పనిచేసిన మహేశ్వరి శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు నుంచి వచ్చారు. అయితే ఇప్పటి వరకూ ఆమెకు పోస్టింగ్ ఇవ్వలేదు. ఆమెకు పోస్టింగ్ ఇచ్చే విషయంపై స్పష్టత కోసం జిల్లావిద్యాశాఖాధికారులు కమిషనర్‌కు లేఖ రాసినట్లు తెలిసింది.

జ్వరంతో మహిళ మృతి



శారదమ్మ

రాయదుర్గం, సెప్టెంబరు 2: తీవ్ర జ్వరంతో గుమ్మఘట్ట మండలం గలగల గ్రామానికి చెందిన ఒంటరి మహిళ శారదమ్మ (65) సోమవారం మృతి చెందారు. ఈమె మధుమేహంతో పాటు జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతూ ఉండేది. రెండురోజులుగా జ్వరం తీవ్రంగా ఉండటంతో అందుబాటులో ఉన్న వైద్యులతో చికిత్సలు చేయించుకున్నారు. పరిస్థితి విషమించడంతో అనంతపురం తీసుకెళుతుండగా మరణించినట్లు బంధువులు తెలిపారు. ఈమెకు పెళ్లైన నలుగురు కుమార్తెలు ఉన్నారు.



హోటల్‌కు చేరుకున్న శ్రేయస్ అయ్యర్



రుతురాజ్ గైక్వాడ్



అర్షదీప్ సింగ్



అక్షర్ పటేల్



హోటల్‌లో క్రికెటర్లు



ఆర్డీటీ మైదానంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసులు

వచ్చేశారు

- అనంతకు చేరిన క్రికెటర్లు
- 5 నుంచి దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లు
- కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 2: దులీప్ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో పాల్గొనే భారత క్రికెటర్లు సోమవారం నగరానికి చేరుకున్నారు. మధ్యాహ్నం నుంచి రాత్రి 10గంటల వరకు ఆటగాళ్లు బెంగళూరు నుంచి రోడ్డుమార్గాన నగరానికి చేరుకున్నారు. హోటల్ సిబ్బంది, ఆంధ్రా, జిల్లా క్రికెట్ సంఘాల సభ్యులు క్రికెట్ ఆటగాళ్లకు నుదిటిన కుంకుమ పెట్టి, కొబ్బరికాయ, బొకేలు అందజేసి స్వాగతం పలికారు. నగరానికి చేరిన వారిలో ఇండియా-సీ జట్టులో భారత కీలక ఆటగాళ్ల రుత్‌రాజ్ గైక్వాడ్ (కెప్టెన్), సాయి సుదర్శన్, రజత్ పటీదార్, అభిషేక్ పోరల్, బి ఇంద్రజిత్, హృతిక్ షోకీన్, మానవ్ సుతార్, గౌరవ్‌యాదవ్, వైషాక్ విజయ్‌కుమార్, అన్షుల్ కాంబోజ్, హిమాన్షుచౌహాన్, మయాంక్ మార్కండే, సందీప్ వారియర్ ఉన్నారు. ఇండియా-డీ జట్టులో.. శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అతర్వ తైడే, యష్‌దుబే, దేవ్‌దత్త్ పడిక్కల్, ఇషాన్‌కిషాన్, రికీభుయ్, సరాన్ష్‌జైన్, అక్షర్‌పటేల్, అర్షదీప్‌సింగ్, ఆదిత్య థాక్రే, హర్షిత్‌రాణా, తుషార్ దేశ్‌పాండే, ఆకాష్‌సేన్ గుప్తా, కేఎస్ భరత్, సౌరభ్‌కుమార్ నగరంలోని అలెగ్జాండర్ హోటల్‌కు చేరారు. హోటల్‌లో బస చేసిన ఆటగాళ్లు మంగళవారం అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో ప్రాక్టీస్‌కు హాజరుకానున్నారు. ప్రాక్టీస్ సెషన్‌కు ఎవరికీ అనుమతి లేదని, ఐదు నుంచి అభిమానులను మ్యాచ్‌కు అనుమతిస్తామని దులీప్‌ట్రోఫీ కమిటీ సెక్రటరీ షాబుద్దీన్ తెలిపారు.

పోలీసు వలయంలో ఏసీజీ

అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌పోలీసుల భద్రతా వలయంలోకి చేరింది. ఈనెల 5 నుంచి 22వతేదీ వరకు అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో, ఆటగాళ్లు బసచేసే మాసినేని, అలెగ్జాండర్ హోటళ్ల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో పోలీసుల బృందం సోమవారం ఏసీజీలో, బసచేసే హోటళ్లు మాసినేని గ్రాండ్, అలెగ్జాండర్ వద్ద భద్రతను పరిశీలించారు. హోటల్‌లో ఆటగాళ్ల పట్ల తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై సిబ్బందికి సూచనలు చేశారు. భారత ఆటగాళ్లు ఏసీజీకి వెళ్లే రూట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఏఎస్‌పీలో డ్రెస్సింగ్ రూంలు, పార్కింగ్ ప్రదేశాలు, ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు, గ్యాలరీలు నిశితంగా పరిశీలించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాహనాల రాకపోకలకు చర్యలు తీసుకోనున్నారు. సుమారు 350మందికి పైగా పోలీసులతో దులీప్‌ట్రోఫీకి బందోబస్త్ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

తెగుళ్ల




- పంటలపై తెగుళ్ల దాడి
- పైర్లను పీల్చేస్తున్న పురుగులు
- మందులు వాడినా తగ్గని ఉధృతి
- వాతావరణ మార్పులే కారణం



పత్తిపంటకు పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతు

గుత్తి రూరల్, సెప్టెంబరు 2: వాతావరణ మార్పులతో పంటలపై తెగుళ్ల దాడి తీవ్రమైంది. వేరుశనగ, పత్తి, ఆముదం పైర్లను తెగుళ్లు పీల్చి పిప్పి చేస్తున్నాయి. పైరును ఆకుముడత తెగులుతో పాటు పచ్చపురుగు ఆశించింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ముందస్తుగా వర్షాలు కురవడంతో మృగశిర, పునర్వసు కార్తెలలో నే రైతులు వేరుశనగ, పత్తి, ఆముదం పంటలు సాగు చేశారు. మండల వ్యాప్తంగా వేరుశనగ ఐదు వేల హెక్టార్లు, పత్తి 1900 హెక్టార్లు, ఆముదం 920 హెక్టార్లలో సాగు చేశారు. జూన్ మొదటి వారం నుంచి నెలాఖరి వరకు ఈ పంటలను సాగు చేశారు. ప్రస్తుతం పత్తి పంటకు తెల్లదోమ, పచ్చదోమ, పురుగు ఆశించింది. వాటి కోసం ఇప్పటి వరకు నాలుగు సార్లు మందులు పిచికారీ చేసినట్లు రైతులు చెబుతున్నారు. ఆముదం పంటకు నామాల పురుగు ఆశించింది. వాటి కోసం రైతులు మందులు కొట్టారు. మండలంలోని గొందిపల్లి, జక్కలచెరువు, గాజులపల్లి, తొండపాడు, టీ. కొత్తపల్లి, కొత్త పేట, వన్నేదొడ్డి, ఎంగిలిబండ, ఇసురాళ్లపల్లి, కరిడికొండ, ఊబిచేర్ల, ఈశ్వరపల్లి, తదితర గ్రామాల్లో వేరుశనగ పంటలు సాగు చేశారు. పంట సాగు చేసినప్పటి నుంచి వాతావరణ మార్పులతో పంటకు తెగుళ్లు సోగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్ని మందులు వాడినా చీడల పీడపోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా రైతులు తనను నేరుగా లేదా ఫోన్ సంప్రదించినా తెగుళ్ల నివారణకు తగిన సలహాలు, సూచనలు ఇస్తానని గుత్తి ఏడీఏ వెంకట్రాముడు తెలిపారు.



పంటను ఆశించిన పచ్చపురుగు

నాలుగుసార్లు మందులు కొట్టా..



నేను మూడు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశా. పైరుకు ఆకుముడత, పచ్చపురుగు ఆశించింది. వాటికి పురుగు మందు పిచికారీ చేశాను. ఇప్పటి వరకు నాలుగు సార్లు మందులు కొట్టా. అయినా మళ్లీ పురుగులు పంటను ఆశిస్తున్నాయి. మరోసారి మందు కొట్టాల్సిందే.

- కృష్ణ రైతు, గొందిపల్లి

తగ్గని పురుగుల ఉధృతి



నేను రెండు ఎకరాల్లో జూన్‌లో పత్తి పంట సాగు చేశా. ఒక సారి సత్తువ మందు పోశా. నాలుగు సార్లు పురుగు మందు పిచికారీ చేశా. వాతావరణ మార్పుల వలన పంటకు తెగుళ్ల ఉధృతి పెరుగుతోంది. వాతావరణం అనుకూలిస్తేనే మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

- రంగప్ప రైతు బేతాపల్లి

ఎండుకుళ్లుతో టమోటా రైతు కుదేలు

యాడికి: ఆకులు ఎండు కుళ్ల తెగులుతో పంట దెబ్బతింటుండటంతో టమోటా రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో సుమారు 80నుంచి 100ఎకరాల్లో టమోటా పంట సాగు చేశారు. అసలే ధరలు లేక ఇబ్బంది పడుతుంటే ఉన్న పంటను ఎండుకుళ్ల తెగులు నాశనం చేస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొదట ఒకటి, రెండు మొక్కలకు సోకి ఆకులన్ని ఎండిపోతున్నాయని, పట్టించుకోకపోతే పొలమంతా వ్యాపించి పంటను తొలగించే పరిస్థితులు నెలకొంటున్నాయని రైతులు తెలిపారు. ఎన్నిరకాల మందులు వాడినా ఆశించిన మేర ప్రయోజనం ఉండటం లేదని పేర్కొంటున్నారు. ఈ తెగులు ప్రభావంతో దిగుబడి అంతంత మాత్రంగా ఉంటోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తెగులు ప్రభావం ఎలా ఉంటుందంటే..

రైతులు తెలిపిన మేరకు టమోటా ఆకుల్లో ఎండుకుళ్ల తెగులు ఎలా సోకుతుందంటే వర్షం పడిన రెండు నుంచి మూడు రోజుల తర్వాత టమోటా మొక్క సుడుల వద్ద ఎండిపోవడం ప్రారంభమవుతుంది. అక్కడి నుంచి మొక్క వేర్ల దాకా తెగులు సోకుతుంది. మొక్క పూర్తిగా ఎండిపోతుంది. తెగులు ప్రారంభంలో ఒకట్రెండు మొక్కలే కదా అని నిర్లక్ష్యం చేస్తే పొలం అంతా వ్యాపిస్తుంది.



తెగులుతో ఆకులు ఎండిపోతున్న మొక్క

పంట ఎండిపోతోంది..



నేను రెండు ఎకరాల్లో టమోటా పంట సాగు చేశా. ఉన్నట్లుండి ఆకుల్లో ఎండుకుళ్ల తెగులు కనిపిస్తోంది. ఎన్ని మందులు పిచికారి చేసినా తెగులు అదుపులోకి రావడం లేదు. దీంతో పంటను కోల్పోవాల్సి వస్తోంది. ధర లేక ఇబ్బంది పడుతుంటే తెగులుతో మరింత నష్టపోవాల్సి వస్తోంది.

- రజనీ, టమోటా రైతు, రాయలచెరువు

తెగులు ప్రభావం ఎక్కువగా ఉంది..



నేను మూడున్నర ఎకరాల్లో టమోటా సాగుచేశా. వర్షం పడిన రెండు రోజుల తర్వాత టమోటా పంటకు ఎండుకుళ్ల తెగులు సోకుతోంది. మందులు పిచికారి చేసినప్పటికి తెగులు అదుపులోకి రావడం లేదు. తెగుళ్ల బారినుంచి పంటను కాపాడుకోవడానికి పెట్టుబడులు ఎక్కువగా పెట్టాల్సి వస్తోంది.

- విశ్వనాథ్, టమోటా రైతు, రాయలచెరువు

సస్యరక్షణ చర్యలు చేపట్టండి: శాస్త్రవేత్తలు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 2: వర్షాల కారణంగా జిల్లాలోని పలు రకాల పంటలకు తెగుళ్లు సోకాయని, వాటి నివారణకు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కళ్యాణదుర్గం కేవీకే ప్రధాన శాస్త్రవేత్త చంద్రాయుడు, శాస్త్రవేత్త శిరీష సూచించారు. వేరుశనగ పంటలో వేరుపురుగు, ఆకు మచ్చ, వేరుకుళ్లు తెగుళ్ల నివారణ కోసం 2 మి.లీ. క్లోరోపైరిపాస్, 4 గ్రాములు సాఫ్‌ను ఒక ఎకరాకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. కందిలో మొక్క పురుగు, రసం పీల్చే పురుగుల నివారణ కోసం 400 మి.లీ. స్పైనిటిరామ్‌ను ఒక ఎకరానికి పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఆముదం పంటలో నామాల పురుగు, ఆకు మచ్చ నివారణ, మొక్కజొన్నలో కత్తెర పురుగు, ఆకుమాడు తెగులు నివారణ కోసం 80 మి.లీ. ఇమామిక్టిన్ బెంజోయేట్, 400 గ్రాములు సాఫ్‌ను ఎకరానికి పిచికారీ చేసుకోవాలని సూచించారు. టమోటాలో గజ్జి తెగులు, కాల్షియం లోపం నివారణ కోసం 400 గ్రాములు సాఫ్, 50 గ్రాములు బారాక్స్‌ను ఎకరానికి పిచికారీ చేసుకోవాలని సూచించారు. మిరప, వంగ, ఇతర కూరగాయల పంటల్లో ఆకు మచ్చ తెగులు, రసం పీల్చే పురుగుల నివారణ కోసం 400 గ్రాములు సాఫ్, 200 మి.లీ. స్పైనిటిరామ్‌ను ఎకరానికి పిచికారీ చేసుకోవాలని సూచించారు. అరటి, చిన్న నిమ్మ తోటల్లో సూక్ష్మధాతులోపాలు, రసం పీల్చే పురుగుల నివారణ కోసం 500 గ్రాములు పొటాషియం నైట్రేట్, 200 మి.లీ. స్పైనిటిరామ్‌ను ఎకరాకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. వివిధ పంటల్లో అధిక తేమ మూలంగా సూక్ష్మధాతులోపాల నివారణ కోసం అర కేజీ అన్నబేది, అర కేజీ మాక్స్, అర కేజీ మల్టీకేని ఎకరా పొలంలో పిచికారీ చేసుకోవాలని సూచించారు.

వైసీపీ మూకల వీరంగం

వేటకొడవళ్లతో టీడీపీ వర్గీయులపై దాడులు

కుణుతూరు, కొండాపురంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన లక్ష్మీదేవి



గాయపడిన ప్రకాష్‌గౌడ్

ధర్మవరంరూరల్/బుక్కపట్నం, సెప్టెంబరు2: వైసీపీ మూకలు గూండాగిరీ ప్రదర్శించారు. వేటకొడవళ్లతో వీరంగమే చేశారు. టీడీపీ వర్గీయులపై సోమవారం విచక్షణారహితంగా దాడులకు తెగబడ్డారు. ధర్మవరం మండలంలోని కుణుతూరు గ్రామంలో టీడీపీ వర్గీయుడు కొసిన ప్రకాష్‌గౌడ్ ఇంటి సమీపంలోనే వైసీపీకి చెందిన నరేంద్ర నివాసం ఉంటున్నాడు. తన ఇంటికి విద్యుత్ సరఫరా కావట్లేదని నరేంద్ర తరచూ ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజులు తొలగిస్తున్నాడు. సోమవారం రాత్రి కూడా ఫ్యూజులు తొలగించడంతో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. ఈ నేపథ్యంలో ప్రకాష్‌గౌడ్.. మరమ్మతులు ఉదయాన్నే చూసుకోవాలనీ, రాత్రిళ్లు విద్యుత్ సరఫరా ఆపేస్తే ఎలా అని ప్రశ్నించాడు. దీంతో కోపోద్రిక్తుడైన నరేంద్ర, అతడి తల్లి ఈశ్వరమ్మ, తమ్ముడు ఆనంద్, చిన్నాన్న నారప్ప కలిసి ప్రకాష్‌గౌడ్‌తో గొడవకు దిగారు. అతడి తలపై కొడవలితో దాడి చేశారు. దీంతో తీవ్రంగా గాయపడిన ప్రకాష్‌గౌడ్‌ను కుటుంబసభ్యులు బైక్‌లో ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడు ప్రకాష్‌గౌడ్ ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, విచారణ చేపట్టారు.

కొండాపురంలో మహిళపై..

బుక్కపట్నం మండలంలోని కొండాపురం గ్రామంలో వైసీపీ నాయకుడు, స్టోర్ డీలర్ నల్లపరెడ్డి సోమవారం వీరంగం సృష్టించాడు. కుమారుడు వేణుగోపాల్ రెడ్డితో కలిసి వేట కొడవళ్లతో గ్రామంలోని టీడీపీ సీనియర్ నాయకుడు భాస్కర్‌రెడ్డి ఇంటిపై దాడి చేశాడు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గత వైసీపీ హయాం నుంచి గ్రామంలో నల్లపరెడ్డి స్టోర్ నిర్వహిస్తున్నాడు. సోమవారం విజిలెన్స్ అధికారులు రేషన్ దుకాణంలో తనిఖీలు చేపట్టారు. ఇందుకు భాస్కర్‌రెడ్డి కారణమన్న ఆక్రోశంతో నల్లపరెడ్డి అతడి కుమారుడు వేణుగోపాల్‌రెడ్డి వేటకొడవళ్లతో వీరంగం చేశారు. భాస్కర్‌రెడ్డి ఇంటిపైకి వెళ్లారు. ఆ సమయంలో భాస్కర్‌రెడ్డి ఇంట్లో లేకపోవడంతో ఆయన భార్య లక్ష్మీదేవిపై దాడిచేశారు. విచక్షణారహితంగా కొట్టారు. 'నీభర్త భాస్కర్‌రెడ్డి, కుమారుడు నాగిరెడ్డిని చంపేస్తామం'టూ బెదిరించి, నానా దుర్భాషలాడి వెళ్లిపోయారు. గాయపడిన లక్ష్మీదేవిని పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్టు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 2: గంజాయి తెచ్చి విక్రయిస్తున్న నగరంలోని నీరుగంటి వీధికి చెందిన వాయకర్ గణపతిరావు వన్‌టౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సులభంగా డబ్బు సంపాదించేందుకు నిందితుడు గంజాయి వ్యాపారంలోకి దిగాడని పోలీసులు తెలిపారు. గంజాయికి అలవాటుపడిన వారి నుంచి విశాఖపట్నం జిల్లా పాడేరుకు చెందిన గంజాయి వ్యాపారులు చిట్టి, పొట్టి ఫోన్ నంబర్లు తీసుకున్నాడని, ఆరు నెలల నుంచి వ్యాపారం చేస్తున్నాడని తెలిపారు. అనకాపల్లికి రైలులో, అక్కడి నుంచి పాడేరుకు బస్సులో వెళ్లి కిలో గంజాయి రూ.7 వేలకు కొని అనంతపురం నగరానికి తీసుకువచ్చి కిలో రూ.15 వేలకు అమ్ముతున్నాడని తెలిపారు. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. గుత్తి రోడ్డులోని మిర్చియార్డ్ సర్కిల్‌లో నిందితుడని అరెస్టు చేశారు. అతని నుంచి 3.5 కిలోల గంజాయి, మొబైల్ ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

రూడ్‌సెట్‌లో మహిళలకు ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 2: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు రూడ్‌సెట్ ఆధ్వర్యంలో ఉచితంగా టైలరింగ్, బ్యూటీపార్లర్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. ఈనెల 9 నుంచి ప్రారంభించి 30రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఆధార్, రేషన్ కార్డు కలిగిన మహిళలు అర్హులన్నారు. వివరాలు, పేర్ల నమోదుకు 8309915577, 9618876060లను సంప్రదించాలని కోరారు.

ఐఎంఎల్ డిపో మేనేజర్‌కు బంద్ నోటీసు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 2: ఏపీ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోషియేషన్ నాయకులు అనంతపురం ఐఎంఎల్ డిపో మేనేజర్ శివశంకర్‌రెడ్డికి సోమవారం బంద్ నోటీసులు అందజేశారు. జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాలను ఈనెల 7వ తేదీ బంద్ చేయిస్తామని అందులో పేర్కొన్నారు. డిపో మేనేజర్‌ను సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర‌రెడ్డి, నాయకులు మహేంద్ర, భరత్, రమేష్, హరీష్, వేణుగోపాల్‌రెడ్డి, రామకృష్ణ, నాగేంద్ర, రాజశేఖర్, నరసింహరాజు కలిశారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలోని మద్యం దుకాణాలను 7వ తేదీన బంద్ చేయాలని నిర్ణయించామని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

జీడిపల్లికి 913 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 2: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు సోమవారం 913 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 534 క్యూసెక్కులు ఔట్‌ఫ్లో అవుతున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే మరువ ద్వారా పీఏబీఆర్‌కు 339 క్యూసెక్కుల నీరు వెళుతున్నట్లు వెల్లడించారు.

సూపర్ మచ్చా

- దత్తారెడ్డి సెంచరీ.. జిల్లా జట్టు భారీ స్కోరు



మచ్చా దత్తారెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 2: జిల్లా క్రీడాకారుడు మచ్చా దత్తారెడ్డి సూపర్ సెంచరీతో జిల్లా జట్టు భారీ స్కోరు చేసింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడపలో జరుగుతున్న అండర్-23 ఆంధ్రాసౌత్ జోనల్ స్థాయి టోర్నీలో జిల్లా జట్టు కెప్టెన్ మచ్చా దత్తారెడ్డి కడప జట్టుపై అద్భుత సెంచరీ సాధించాడు. 155 బంతుల్లో 11 సిక్సులు, 13 ఫోర్లతో 181 పరుగులు సాధించాడు. దీంతో జిల్లా జట్టు 553 పరుగుల భారీ స్కోర్ చేసింది. కడప బౌలర్లు అస్లాం 5వికెట్లు, ఆదిల్‌హుస్సేన్ 4, విజయ్ ఒక వికెట్ పడగొట్టారు. ఆంధ్రా, జిల్లా క్రికెట్ సంఘం సభ్యులు దత్తారెడ్డిని అభినందించారు.

రిజిస్ట్రేషన్‌ను పూర్తి చేసుకోండి: ఏడీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 2: ఉమ్మడి జిల్లాలోని 614 మసీదులలో ప్రభుత్వ గౌరవ వేతనం పొందుతున్న ముతవల్లీలు, మేనేజింగ్ కమిటీ ప్రెసిడెంట్‌లు యుటిలైజేషన్ సర్టిఫికెట్, వక్ఫ్ ఆస్తులను పరిరక్షించే 36, 40, 41 సెక్షన్ల కింద రిజిస్ట్రేషన్‌ను పూర్తి చేసుకోవాలని మైనార్టీ సంక్షేమశాఖ ఉమ్మడి జిల్లా ఏడీ రామసుబ్బారెడ్డి సూచించారు. ఫారం-1 అప్లికేషన్, మసీదు ఒరిజినల్ పత్రాలు, లింక్ డాక్యుమెంట్ లేదా తహసీల్దారు నుంచి పొజిషన్ సర్టిఫికెట్, బ్లూ ప్రింట్, ముతవల్లి, ఇమాం, మౌజాన్, ఇద్దరు సాక్షుల ఆధార్ కార్డులు, మసీదుల ఫొటోలు, ఫోన్ నంబర్లతో ఒకటి ఒరిజినల్ సెట్, మూడు జిరాక్స్ కాపీలు కలెక్టరేట్ ఆవరణంలోని వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో అందజేయాలని సూచించారు. అనంతరం గుర్తింపు రశీదులను తీసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తులను సమర్పించకపోతే గౌరవ వేతనాలు నిలిపివేసే ప్రమాదం ఉందని అన్నారు. తక్షణమే రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9966647586, 9573073786, 9032557006 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

16 బైకులు చోరీ చేసిన వ్యక్తి అరెస్ట్

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 2: కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల్లో పలుచోట్ల 16 ద్విచక్ర వాహనాలను చోరీ చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ రవిబాబు తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ సోమవారం వెల్లడించారు. కుందుర్పి మండలం బోదపల్లికి చెందిన పాతన్న అనంతపురం, కళ్యాణదుర్గం, బెళుగుప్ప, కర్ణాటకలోని బళ్లారి, పావగడ పోలీస్‌స్టేషన్‌లలో 23 పాత కేసులలో నిందితుడని తెలిపారు. పట్టణంలోని ఉమానగర్‌లో ఓ ద్విచక్ర వాహనం చోరీ కావడంతో ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టి పాత నేరస్థులను విచారించగా సూత్రధారిగా పాతన్న పేరు బయటపడిందన్నారు. దీంతో అతడిని అరెస్టు చేసి 16 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసును ఛేదించిన సీఐ హరినాథ్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

23 మందికి గాయాలు.. ఎక్కువ మంది కూలీలే..

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని మూడు ప్రాంతాల్లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. 23 మంది గాయపడ్డారు. బాధితులను అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతులలో ఒకరు, గాయపడ్డవారిలో ఎక్కువ మంది వ్యవసాయ కూలీలు.

బైకు అదుపుతప్పి..

గార్లదిన్నె: రామదాసుపేట-కనుంపల్లి సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజశేఖర్ (26) అనే యువకుడు మృతిచెందాడు. నార్పల సుల్తాన్‌పేటకు చెందిన ఆదినారాయణ, దానమ్మ దంపతుల కుమారుడు రాజశేఖర్ సోమవారం సాయంత్రం గుత్తి వైపు నుంచి నార్పలకు వస్తుండగా కనుంపల్లి సమపంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన రాజశేఖర్ అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభు త్వ ఆస్పత్రి వద్దకు చేరుకుని బోరున విలపించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో.. బొలెరో ఢీకొని..

కళ్యాణదుర్గం: కంబదూరు మండలం కుర్లపల్లి, మేలుకుంట క్రాస్‌లో వ్యవసాయ కూలీలు ప్రయాణిస్తున్న ఆటోను బొలెరో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కూలీ అన్నపూర్ణమ్మ (50) మృతి చెందారు. మరో 14 మంది కూలీలు గాయపడ్డారు. కర్ణాటకలోని రొప్పం గ్రామానికి చెందిన 15 మంది కూలీలు టమోటా పంటను కోసేందుకు కంబదూరు మండలం కుర్లపల్లికు వస్తుండగా.. బొలెరో ఢీకొట్టింది. ఈ వేగానికి ఆటో మూడు పల్టీలు కొట్టడంతో కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రికి తరలిస్తుండగా అన్నపూర్ణమ్మ మృతిచెందారు. బాధితులకు కళ్యాణదుర్గం ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ఆటోడ్రైవర్ రాముకు రెండుకాళ్లు విరిగిపోయాయి. కంబదూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



రాజశేఖర్ (ఫైల్)

బైకు.. ఆటో ఢీ..

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రానికి సమీపంలో, జాతీయ రహదారిపై ద్విచక్రవాహనాన్ని ఢీకొని ఆటో బోల్తా పడటంతో 9 మంది గాయపడ్డారు. వీరిలో ఏడుగురు మహిళా కూలీలు ఉన్నారు. న్యామద్దల గ్రామానికి చెందిన కూలీలు చెన్నేకొత్తపల్లిలో వ్యవసాయ పనులను ముగించుకుని తిరిగి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. రాంగ్ రూట్‌లో వస్తున్న ఆటోను పెనుకొండ వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో ఆటో రోడ్డు పక్కన బోల్తాపడింది. కూలీలు వెంకటనరసమ్మ, నాగలక్ష్మి, తలారినరసమ్మ, అరుణ, నరసమ్మ, రామాంజినమ్మ, లక్ష్మీదేవి, ఆటో డ్రైవర్ చంద్రమౌళి, ద్విచక్రవాహనదారుడు సంతోష్ గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రెండు 108 వాహనాల్లో అనంతపురం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



కంబదూరు మండలంలో జరిగిన ప్రమాదంలో గాయపడిన కూలీలు

శాస్త్రోక్తంగా మృత్యుంజయ హోమం


హోమం నిర్వహిస్తున్న పండితులు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 2: లోకకల్యాణం కోసం సోమవారం మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో మృత్యుంజయ హోమంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలవల్ల విపత్కర పరిస్థితులు ఏర్పడకూడదని కాంక్షిస్తూ వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ హోమాన్ని నిర్వహించారు. ఆలయ ఈఓ సాకే రమేష్‌బాబు, అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, ప్రధానార్చకుడు నరసింహశాస్త్రి, పరమేష్, హర్ష, భక్తులు పాల్గొన్నారు.

అనంతేశ్వరస్వామికి విశేష పూజలు


అలంకరణలో స్వామి, అమ్మవారు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 2: శ్రావణమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని శారదానగర్‌లోని శివబాలయోగి ఆశ్రమంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతేశ్వరి సమేత అనంతేశ్వరస్వామి మూలవిరాట్‌లకు ఫలపంచామృతాభిషేకాలు, గంధాభిషేకం, సుగంధ ద్రవ్యాభిషేకాలు నిర్వహించారు. అనంతరం కుంకుమార్చనలు, పుష్పార్చనలు చేశారు. ఆశ్రమ కమిటీ అధ్యక్షుడు జూటూరు అరవింద్, ఉపాధ్యక్షుడు రత్నగిరి దేవరాజ్, కార్యదర్శి మల్లికార్జున, కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పేదలకు న్యాయం జరిగేలా చూడండి

అనంతపురం రూరల్, సెప్టెంబరు 2: అనంతపురంరూరల్ మండలం కురుగుంట గ్రామ సర్వే నంబరు 41లో పేదలకు ఇచ్చిన ఇంటి పట్టాల్లో పేదలకు న్యాయం జరిగేలా చూడాలని ఏపీ ఎంఆర్‌పీఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు రమణ కోరారు. ఆమేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. సర్వే నెంబరు 41లో ల్యాండ్‌సీలింగ్‌లోనిదన్నారు. ఈ భూమిని సబ్‌డివిజన్ చేయడానికి వీలులేదన్నారు. అయితే కొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు తమకు అనుకూలంగా సబ్ డివిజన్ చేయించారన్నారు. వెంటనే సబ్ డివిజన్ చేయించినవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఓబులేసు, నాయకులు రామక్రిష్ణ, సత్యమయ్య పాల్గొన్నారు.

అర్బన్‌బ్యాంకు చైర్మన్‌కు సన్మానం


జేఎల్ మురళీధర్‌ను సన్మానిస్తున్న డైరెక్టర్లు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 2: తమిళనాడులోని హోసూరులో ఉన్న ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ యూనివర్శిటీలో గౌరవ డాక్టరేట్ అందుకున్న అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్‌ను సన్మానించారు. సోమవారం స్థానిక సుభాష్‌రోడ్డులో ఉన్న శ్రీకృష్ణదేవరాయభవన్‌లో డాక్టరేట్ అందుకున్న మురళీధర్‌ను డైరెక్టర్లు పుష్పగుచ్ఛం, శాలువతో సత్కరించారు. బ్యాంకు వైస్‌చైర్మన్ కృష్ణకుమార్, డైరెక్టర్లు రొళ్ల భాస్కర్, బంగారు బాషా, సుంకర రమేష్, నాయకులు మార్కెట్ శ్రీధర్, మున్వర్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


నర్సిరెడ్డి (ఫైల్)

శింగనమల, సెప్టెంబరు 2: మండలంలోని ఏకులనాగేపల్లి గ్రామానికి చెందిన మరప్పరెడ్డి చిన్న నర్సిరెడ్డి అదృశ్యంపై కేసే నమోదు అయింది. నర్సిరెడ్డి మూడు నెలల క్రితం ఇంటినుంచి పోయి తిరిగి రాలేదు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు వెతుకుతున్నా అతని జాడ కనిపించలేదు. దీంతో నర్సిరెడ్డి కుమారుడు సోమవారం శింగనమల పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

భార్య ఆత్మహత్య కేసులో అరెస్ట్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 2: మూడు రోజుల క్రితం ఓ మహిళ ఆత్మహత్య కేసులో ఆమె భర్తను నాలుగో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ సాయినాథ్ తెలిపిన మేరకు. తపోవనంలో నివాసముంటున్న వెంకటలక్ష్మి మూడు రోజులక్రితం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె తల్లి నారాయణమ్మ.. అల్లుడు శివరామయ్యపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడం, నిలదీసిన భార్యను శారీరక, మానసిక వేధింపులకు గురిచేసేవాడని, ఉద్యోగం చేస్తానని భార్య కోరితే పంపకుండా వేధించేవాడని ఫిర్యాదులో పేర్కొంది. విచారణ చేపట్టిన ఫోర్త్‌టౌన్ పోలీసులు సోమవారం శివరామయ్యను అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పరిచారు.

బైక్ దొంగ..

నగరంలోని రెండో రోడ్డులో గత ఏడాది ఒకే ఇంట్లో మూడు దఫాలుగా దొంగతనం చేశాడు. చివరకు ఎవరో పోలీసులకు చెబితే విచారణలో అతన్ని పట్టుకున్నారు. ఇప్పుడు ఓ బైక్‌ను దొంగలించడంతో త్రీటౌన్ పోలీసులు సోమవారం ఆ దొంగను అరెస్ట్ చేశారు. గుజరాత్ రాష్ట్రం సూరత్‌కు చెందిన షేక్ షామీర్ ఆరేళ్ల వయస్సులో తండ్రి మృతి చెందాడు. తల్లి రెండో పెళ్లి చేసుకోవడంతో రైలు ఎక్కి అనంతపురం వచ్చేశాడు. బాలల సంరక్షణ కమిటీ సహాయంతో విజయనగరకాలనీలోని అనాథాశ్రమంలో ఉండేవాడు. అక్కడ నుంచి పంపివేయడంతో కడపకు వెళ్లి తిరిగి అనంతపురం వచ్చాడు. క్లీనర్‌గానూ అనంతరం గుత్తిరోడ్డులోని మయూరి హోటల్‌లో పనిచేశాడు. రెండోరోడ్డులో దొంగతనం కేసులో జూలైలో జైలు నుంచి బయటకొచ్చాడు. ఐదురోజుల క్రితం రెండోరోడ్డులోని ఓ అపార్ట్‌మెంటు కింద మోటర్‌బైక్‌ను దొంగలించాడు. ఆకుల సాయిసాగర్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ సీఐ శాంతిలాల్ విచారణ చేసి సోమవారం షామీర్‌ను అరెస్ట్ చేశారు.

కట్నం వేధింపులు భరించలేక ఆత్మహత్య

అనంతపురం క్రైం, సెప్టెంబరు 2: అదనపు కట్నం వేధింపులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. టూటౌన్ సీఐ శ్రీకాంత్ తెలిపిన మేరకు.. గుంతకల్లులోని హౌసింగ్‌బోర్డుకు చెందిన సాకే కుమారి(26)కి ఏడాది క్రితం అనంతపురంలోని నవోదయకాలనీకి చెందిన మురళితో వివాహమైంది. కట్నం కింద 10తులాల బంగారు, రూ.4 లక్షలు ఇచ్చారు. ఆదర్శనగర్‌లో దంపతులు నివాసముండేవాడు. మురళి బజాజ్ ఫైనాన్స్‌లో పనిచేస్తున్నాడు. గత కొంత కాలంగా భర్త, అత్త రామలక్ష్మి, అత్త సోదరి రామక్క కుమారిని అదనపు కట్నం తేవాలంటూ వేధించేవారు. మనస్థాపానికి గురైన కుమారి సోమవారం ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లిదండ్రులు ఎరుకల రామాంజినమ్మ, వన్నూరప్ప ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

భర్తకు 6 నెలల జైలు

భార్యను అదనపు కట్నం తేవాలని శారీరకంగా, మానసికంగా వేధించిన కేసులో భర్తకు 6నెలల జైలుశిక్ష, రూ.1500 జరిమానా విధించారు. అనంతపురానికి చెందిన కిరణ్మయిని బళ్లారికి చెందిన రామిశెట్టి శ్రీధర్‌కు 2017లో వివాహం జరిగింది. అదనపు కట్నం తీసుకురావాలని వేధింపులకు గురిచేశారనే ఫిర్యాదుపై భర్త, ఆమె అత్త రామిశెట్టి అనూరాధపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో 2018లో కేసు నమోదైంది. విచారణ అనంతరం సోమవారం ఫస్ట్ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రతిభ నిందితుడు శ్రీధర్‌కు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఏపీపీ సుచిత్ర, అప్పటి ఎస్ఐ సరోజమ్మ, కోర్టు కానిస్టేబుల్ సాలప్ప, కుమార్‌లను ఎస్పీ జగదీష్ అభినందించారు.

మూడు ట్రాక్టర్ల సీజ్

ఉప్పరపల్లి నుంచి నగరంలోకి వస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను ఇటుకలపల్లి పోలీసులు సీజ్ చేశారు. నిబంధనలు లేకుండా సోమవారం ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఇటుకలపల్లి ఎస్ఐ బాధ్యతలు

ఇటుకలపల్లి ఎస్ఐగా విజయ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లిలో పనిచేస్తున్న విజయ్‌కుమార్‌ను ఇక్కడకు బదిలీ చేశారు.

ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దు: కలెక్టర్


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 2: ప్రజా ఫిర్యాదుల విషయంలో నిర్లక్ష్యం చేయరాదని అధికారులకు కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ సూచించారు. కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల వేదిక నిర్వహించారు. వివిధ ప్రాంతల ప్రజల నుంచి కలెక్టర్, డీఆర్వో రామకృష్ణారెడ్డి 384 అర్జీలు స్వీకరించారు. భూసమస్యలపై వేదిక నుంచే కలెక్టర్ డివిజన్, మండలస్థాయి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. డబ్బులు ఇవ్వకపోతే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారని, గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదులను పరిష్కరించకుండా.. పరిష్కరించినట్లు మెసేజ్‌లు పెడుతున్నారని 108 ఉద్యోగులు సుంకన్న తదితరులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విచారించి మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని డీఎంహెచ్ఓను కలెక్టర్ ఆదేశించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక ఇబ్బంది పడుతున్నామని రాఘవేంద్ర కాలేజ్ ఫార్మా-డి విద్యార్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సమస్యను పరిష్కరించాలని బీసీ వెల్ఫేర్ డీడీసీ కలెక్టర్ ఆదేశించారు. ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు పాఠశాలల విజిట్‌కు వెళ్లడం లేదని, పర్యవేక్షించాలని సూచించారు. పింఛన్ల పంపిణీలో ముందు వరుసలో ఉన్న మండలాల అధికారులు, సిబ్బందిని కలెక్టర్ సత్కరించారు.

వైఎస్ఆర్ ఆశయాలను కొనసాగిద్దాం


వైఎస్ఆర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 2: మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి ఆశయాలను కొనసాగిద్దామని పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ పేర్కొన్నారు. సోమవారం వైఎస్ఆర్ వర్ధంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఘన నివాళులు అర్పించారు. జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి శైలజానాథ్ హాజరయ్యారు. వైఎస్ఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు వాసు, జాన్‌వెస్లీ, శివశంకర్ యాదవ్, పరమేశ్వరరెడ్డి, శర్మాస్‌వలి, శ్రీకాంత్, నిశాంత్‌రెడ్డి, మూర్తి, మల్లికార్జున, అంజి, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇడుపులపాయలో... కడప జిల్లా ఇడుపులపాయలోని వైఎస్సార్ సమాధి వద్ద జిల్లా నాయకులు ఘన నివాళులు అర్పించారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్‌తో పాటు జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి పలువురు నాయకులు వైఎస్ఆర్ సమాధి వద్ద పుష్పగుచ్ఛాలు వేసి నివాళి అర్పించారు. అనంతరం శైలజానాథ్ ఆధ్వర్యంలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిలను కలిసి జిల్లాలోని పలు విషయాలపై చర్చించినట్లు నాయకులు తెలిపారు.

వరద ప్రాంతాలకు బృందాలు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 2: వరద ప్రాంతాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారం, సహాయక చర్యల నిమిత్తం ఉమ్మడి జిల్లా నుంచి బృందాలను పంపుతున్నామని విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ తెలిపారు. విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయం నుంచి వెళుతున్న సిబ్బంది వాహనాన్ని సోమవారం రాత్రి ఆయన జెండా ఊపి ప్రారంభిచారు. ఉమ్మడి జిల్లా నుంచి విజయవాడకు ఎనిమిది బృందాలు వెళుతున్నాయని ఆయన తెలిపారు. విజయవాడలోని విద్యుత్ శాఖ అధికారుల వద్ద రిపోర్ట్ చేసుకున్న తరువాత అక్కడ విధుల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ బృందాల్లో డీఈఈలు, ఏఈఈలు, ఇతర సిబ్బంది ఉన్నారు.

జాగ్రత్తగా ఉండాలి: డీపీఓ

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 2: వర్షాల కారణంగా ఎలాంటి సమస్యలు తలెత్తినా పరిష్కరించేందుకు పంచాయతీ కార్యదర్శులు సిద్ధంగా ఉండాలని డీపీఓ ప్రభాకర్‌రావు ఆదేశించారు. పారిశుధ్య సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించారు. పంచాయతీల పరిధిలో సమస్యలను పీఆర్-1 యాప్‌లో నమోదు చేయాలని, పరిష్కరించిన తరువాత వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. కార్యదర్శి నుంచి ఈఓఆర్డీ, డీఎల్‌పీఓ, డీపీఓ, పంచాయతీరాజ్ కమిషనర్, డైరెక్టర్ వరకు యాప్‌లో వివరాలు తెలుసుకుంటారని అన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉన్నతాధికారులకు దొరికిపోతారని, అప్రమత్తంగా ఉండాలని కార్యదర్శులకు సూచించారు.

నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలి

నార్పల, సెప్టెంబరు 2: నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని సీపీఐ నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు. గంగాధర్, రమేష్, సుధాకర్, నాగరాజు, పెద్దయ్య నారాయణప్ప, గఫూర్, రాజు, పాల్గొన్నారు.

చిరుజల్లులు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 2: జిల్లాలోని 24 మండలాల్లో ఆదివారం రాత్రి, సోమవారం చిరుజల్లులు పడ్డాయి. పామిడి మండలంలో అత్యధికంగా 9.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఉరవకొండ 8.4, వజ్రకరూరు 7.8, విడపనకల్లు 7.2, గుత్తి 6.6, గుంతకల్లు 5.6, కంబదూరు 4.2, పెద్దవప్పూరు 4.0, కణేకల్లు, పుట్లూరు 3.0, రాయదుర్గం, యాడికి, గుమ్మఘట్ట, ఆత్మకూరు 2.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో 2.0 మి.మీ.లోపు వర్షపాతం నమోదైంది.

ఘనంగా హరికృష్ణ జయంతి


కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 2: అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో సినీనటుడు హరికృష్ణ జయంతి, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు సోమవారం నిర్వహించారు. కేక్ కట్ చేసి ఒకరికొరు తినిపించుకొని ఆనందాన్ని పంచుకున్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు తలారి ఆదినారాయణ, బుగ్గయ్యచౌదరి, నాయకులు కూచి హరి, గుర్రం నాగభూషణం, కుంచెపు వెంకటేష్, లక్ష్మీనరసింహ, బండి కాశీ విశ్వనాథ్, పోతుల లక్ష్మీనరసింహులు, జోగి రాజేంద్ర, నెట్టెం బాలకృష్ణ,తాజుద్దీన్, ఫిరోజ్ అహ్మద్, గోళ్ల సుధాకర్‌నాయుడు, కడియాల కొండన్న, చెరుకుతోట పవన్‌కుమార్, సంగా తేజస్విని, వడ్డే భవాని, అయేషా పాల్గొన్నారు.

సూపర్‌మార్కెట్ పేరిట బురిడీ

● ప్రభుత్వ టీచర్‌పై ఎస్పీకి ఫిర్యాదు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 2: ఈ-స్టోర్ ఇండియా సూపర్ మార్కెట్ పేరుతో ఓ ప్రభుత్వ టీచర్ కొందరిని బురిడీ కొట్టించాడు. ఏకంగా రూ.కోటి దోచేశాడు. తీసుకున్న సొమ్ము తిరిగి చెల్లిస్తాడని రెండేళ్లపాటు ఎదురుచూసిన బాధితులు ఎస్పీ జగదీష్‌ను సోమవారం కలిసి ఫిర్యాదు చేశారు. జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన బాధితులు రామలక్ష్మిరెడ్డి, వేణుగోపాల్, కవిత, పద్మలత, శ్యాంసుందర్‌రెడ్డి, శాంతికుమారి.. ఎస్పీని కలిశారు. హిందూపురం పట్టణానికి చెందిన షేక్ మహమ్మద్ సైపుల్లా పరిగి ఎంపీపీ స్కూల్‌లో పనిచేస్తున్నాడని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ-స్టోర్ ఇండియా సీఎండీతో దిగిన ఫొటోలు చూపించి తమను నమ్మించాడని, రూ.కోటితో సూపర్‌మార్కెట్ పెడితే 3 నెలల తరువాత నెలకు రూ.4లక్షలు, మార్కెట్‌లో జరిగే టర్నోవర్‌లో ప్రతి నెలా 5శాతం కమీషన్ ఇప్పిస్తామని నమ్మించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆరుగురం కలిసి యాక్సిస్ ఈ-గ్రూప్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట రూ.కోటి ట్రాన్స్‌ఫర్ చేశామని తెలిపారు. మూడు నెలల తరువాత అడిగితే మరో మూడు నెలలు గడువు చెప్పాడని, ఇలా ఏడాదికిపైగా కట్టుకథలు చెబుతున్నాడని ఎస్పీకి వివరించారు. డబ్బు ఇవ్వకుండా, సూపర్‌మార్ట్ ఏర్పాటు చేయకుండా మోసగించాడని, నిలదీస్తే ఏం చేసుకుంటారో చేసుకోండని దబాయిస్తున్నాడని, తమకు న్యాయం చేయాలని ఎస్పీకి విన్నవించారు.

వంట సామగ్రి వితరణ


ఎంజేపీ గురుకుల పాఠశాలకు వంట సామగ్రిని అందిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, సెప్టెంబరు 2: పరిటాల రవీంద్ర 66వ జయంతి సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు అనంతపురం రూరల్ కన్వీనర్ జింకా సూర్యనారాయణ నసనకోటలో ఉన్న ఎంజేపీ గురుకుల పాఠశాలకు రూ.80వేలు విలువ చేసే వంట సామగ్రిని ఎమ్మెల్యే పరిటాలసునీతకు అందజేశారు. సోమవారం మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఎమ్మెల్యేకు సామగ్రిని అందజేయగా వాటిని పాఠశాల ప్రిన్సిపాల్ అమీనాబేగంకు ఎమ్మెల్యే అందజేశారు. రత్నమోహన్ కూడా రూ.15వేలు విలువ చేసే బీరువాలను అందజేశారు.

రైతులకు పెట్టుబడిసాయం అందించాలి

శింగనమల, సెప్టెంబరు 2: రైతులు పంటలు సాగుచేసేందుకు పెట్టుబడిసాయం రూ.20 వేలు ప్రభుత్వం అందించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ బ్రహ్మయ్య, ఏఓ అన్వేష్‌కుమార్‌కు సంఘం నాయకులు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి కొండారెడ్డి, భాస్కర్, ఓబిరెడ్డి పాల్గొన్నారు.

12న బైబిల్ మిషన్ చర్చి వార్షికోత్సవం

అనంతపురం రూరల్, సెప్టెంబరు 2: బైబిల్ మిషన్ చర్చి ఏడో వార్షికోత్సవాన్ని 12వ తేదీన నిర్వహిస్తున్నట్లు పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రెడ్డివారి నెహెమ్యా నాగరాజు తెలిపారు. మండలంలోని రాచానపల్లి వద్దనున్న అసోసియేషన్ కార్యాక్రమంలో పోస్టర్లు విడుదల చేశారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు మార్క్, కార్యదర్శి ఆనంద్, సహాయకార్యదర్శి మనషే, సభ్యులు రూఫస్ కుమార్, శాంతవర్ధన్, సుధాకర్ పాల్గొన్నారు.

పరిటాల రవీంద్రకు ఎమ్మెల్యే నివాళి


పరిటాల రవీంద్ర ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

రామగిరి, సెప్టెంబరు 2: కల్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు సోమవారం వెంకటాపురంలోని మాజీ మంత్రి పరిటాల రవీంద్ర ఘాట్ వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ముందుగా ఆయన ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన పరిటాల రవి ఘాట్ వద్ద నివాళులర్పించారు.

తాగునీటి కార్మికుల సమస్యలు పరిష్కరించండి


కల్లూరులో తాగునీటి కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న గ్రామస్థులు

గార్లదిన్నె, సెప్టెంబరు 2: తాగునీటి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఉపేంద్ర డిమాండ్ చేశారు. బకాయి వేతనాల కోసం కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారానికి 12వ రోజుకు చేరింది. సమ్మెకు ఐఎఫ్‌టీయూ నాయకులు మద్దతునిచ్చారు. ఆయన మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో ఎంతోమంది ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించడంతో నిర్లక్ష్యం వహించడం బాధాకరమన్నారు. సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, పటాన్ బాషా, తాగునీటి కార్మికులు నాగభూషణం, మల్లరాయుడు, శ్రీనివాసులు, జనార్ధన్, సాంబశివ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నార్పల: సత్యసాయి కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని కార్మికులు పేర్కొన్నారు. బీ పప్పూరు పంప్ హౌస్ వద్ద సత్యసాయి కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం 12వ రోజుకు చేరింది. కార్మికులు అర్ధనగ్నంగా మోకాళ్లపై నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. నాగభూషణ, అంకన్న, పుల్లనాయుడు, శరత్‌బాబు, శ్రీరాములు, చంద్రమోహన్, ఈశ్వరయ్య, వెంకటరమణ పాల్గొన్నారు.

వైసీపీ డీలర్లపై చర్యలు తీసుకోండి


మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు నారాయణస్వామి

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 2: మండలంలో వైసీపీ చౌకధాన్యపు డీలర్లు ప్రజలకు అందాల్సిన ఉచిత బియ్యం, నిత్యావసర వస్తువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి నారాయణస్వామి డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద అక్రమాలకు పాల్పడుతున్న డీలర్లు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకోవాలని ధర్నా చేపట్టారు. ఆయనమాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చినా మండలంలో వైసీపీ అవినీతి ఆగలేదన్నారు. పేద ప్రజలకు పంపిణీ చేయాల్సిన బియ్యం, నిత్యావసర వస్తువులు బహిరంగంగా అమ్ముకుంటున్నారన్నారు. వెంటనే వీరిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఐ చేతివృత్తుల సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి సీవీ హరిక్రిష్ణ, బండిరామకృష్ణ, బాషా, రామాంజనేయులు, దాదు, రాము, సర్దార్, కర్ణ పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును చూసి నేర్చుకో.. జగన్

● టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహులు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 2: భారీ వర్షాలతో విజయవాడ, గుంటూరు జిల్లాల్లో వరదలు వస్తే.. సీఎం చంద్రబాబునాయుడు అర్ధరాత్రి సమయం దాకా పర్యటిస్తున్నారని, ఆయన్ను చూసి జగన్ నేర్చుకోవాలని టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీనరసింహులు హితవు పలికారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచెపు వెంకటేష్, నాయకులు బండి కాశీ విశ్వనాథ్, వన్నూరప్ప, కడియాల కొండన్నలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ అధికారంలో ఉన్నప్పుడు వరదలు వస్తే హెలికాప్టర్లు, పరదాల చాటున పర్యటించేవారని విమర్శించారు. సీఎం చంద్రబాబు వయసును సైతం లెక్క చేయకుండా వరద ప్రాంతాల్లో పర్యటించి, బాధిత ప్రజలకు చేయూతనిస్తుంటే వైసీపీ నాయకులు అమరావతి మునిగిపోయిందని, చంద్రబాబు ఇళ్లు నీటితో నిండిపోయిందని అసత్య ప్రచారాలు చేస్తూ పబ్బం గడుపుతున్నారని మండిపడ్డారు.

ఘనంగా డిప్యూటీ సీఎం పుట్టినరోజు

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 2: ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్, పార్టీ కార్యక్రమాల నిర్వహణ ప్రధానకార్యదర్శి భవానీ రవికుమార్ ఆధ్వర్యంలో కొత్తూరు జూనియర్ కళాశాలలో మొక్కలునాటారు. ఎస్వీ థియేటర్ ఆవరణంలో కేక్ కట్ చేసి ఆనందం పంచుకున్నారు. అనంతరం పాతూరు చెన్నకేశవస్వామి ఆలయంలో డొక్కా సీతమ్మ పేరిట అన్నదానం చేశారు. నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు మురళీకృష్ణ, నాయకులు జయరాంరెడ్డి, అంకె ఈశ్వరయ్య, కుమ్మర నాగేంద్ర, సంజీవరాయుడు, సిద్దూ, జయమ్మ, అవుకు విజయ్‌కుమార్, ముప్పూరి కృష్ణ, సదానందం, గ్రంధి దివాకర్, మేదర వెంకటేష్, వెంకటనారాయణ పాల్గొన్నారు.

బలిజ మహాసంఘం ఆధ్వర్యంలో: రాయలసీమ బలిజ మహాసంఘం ఆధ్వర్యంలో పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. మంగళవారం ఆ సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు తొండపునాటి శంకరయ్య ఆధ్వర్యంలో పవన్ చిత్రపటం వద్ద కేక్ కట్ చేసి ఆనందం పంచుకున్నారు. తొండపునాటి రమేష్, కోనేటి సాయిప్రసాద్, బళ్లారి వెంకటరాముడు పాల్గొన్నారు.

అనంతపురంరూరల్: మండలంలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు కూటమి నాయకులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని పాపంపేట, సిండికేట్ నగర్‌లో టీడీపీ, జనసేన నాయకులు కేక్‌కట్ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం, రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.

శింగనమల: మండలంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక రామస్వామి దేవాలయంలో సోమవారం టీడీపీ, జనసేన నాయకులు కేక్ చేసి తినిపించున్నారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఎంపీడీఓ నిర్మలాకుమారి, సీఐ కౌలుట్లయ్య, ఏపీఓ శ్రీదేవి ఈసీ దామోదర్, శ్రీనివాసలు, జనసేన నాయకులు లక్ష్మీపతి, వెన్నెలకృష్ణ, దివాకర్, టీడీపీ నాయకులు శంకర్, బోయ సత్తి, వెంకటేశ్ పాల్గొన్నారు.


రాయలసీమ బలిజ మహాసంఘం కార్యాలయంలో...


కొత్తూరు జూనియర్ కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

గార్లదిన్నె: మండలంలోని గార్లదిన్నె, కల్లూరు, మర్తాడు తదితర గ్రామాల్లో సోమవారం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలను జనసేన పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. జనసేనా పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి దివే కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మర్తాడు ప్రధాన రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు. తాతయ్య, నాగరాజు, సాయి, రాజు, బాషా పాల్గొన్నారు.

నార్పల: మండల కేంద్రంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ 56వ జన్మదిన వేడుకలను జనసేన నాయకులు గంజికుంట రామకృష్ణ, తుపాకుల విజయభాస్కర్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పలు సేవా కార్యక్రమాలలో జనసేన కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. కొండిశెట్టి ప్రవీణ్ ఆధ్వర్యంలో అనాథాశ్రమంలో అన్నదానం చేశారు.


అనతపురం రూరల్ సిండికేట్‌నగర్‌లో...


శింగనమల: గుమ్మేపల్లిలో మొక్క నాటి నీరుపోస్తున్న నాయకులు


గార్లదిన్నెలో...

దర్గాహోన్నూరులో విషజ్వరాలు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 2: మండల పరిధిలోని దర్గాహోన్నూరులో విషజ్వరాలు విజృంభించాయి. ఇద్దరు విద్యార్థులు, ఒక వృద్ధురాలు ఆస్పత్రి పాలయ్యారు. విద్యార్థిని వైష్ణవి (14) పరిస్థితి విషమించడంతో బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పాల్తూరుకు చెందిన వెంకటలక్ష్మి అనే వృద్ధురాలు బళ్లారిలో చికిత్స పొందుతున్నారు. ఏడేళ్ల లక్ష్మి అనే విద్యార్థిని ఉరవకొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ప్రజలు రోగాల బారిన పడుతున్నా వైద్యులు అందుబాటులో ఉండటం లేదని స్థానికులు వాపోతున్నారు.

ఘనంగా పల్లకి ఊరేగింపు

కణేకల్లు, సెప్టెంబరు 2 : మండల కేంద్రంలో వెలసిన చిక్కణ్ణేశ్వరస్వామి, సిద్ధప్ప స్వామిల ఊరేగింపు సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రావణ మాస చివరి సోమవారం కావడంతో నిర్వాహకులు ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి గ్రామ పురవీధులలో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. అంతకు మునుపు చిక్కణ్ణేశ్వర వడియార్ చెరువు నుంచి తుంగభద్ర జలాన్ని తెచ్చి ఆలయంలో విశేష పూజలను నిర్వహించారు.

ఇంట్లో చోరీ

రాయదుర్గం, సెప్టెంబరు 2: పట్టణంలోని చెన్నవీరస్వామి ఆలయం వద్ద నివాసముండే లక్ష్మీదేవి ఇంట్లో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న వెండిదీపాలు, వెండి కుంకుమ భరణిలతో పాటు వివిధ నగలు, రూ. 20 వేల నగదు, ఎల్ఐసీ బాం డ్లను, సెల్‌ఫోన్‌లను అపహరించారు. లక్ష్మీదేవి సమీపంలో ఉన్న దేవాలయంలో పూజల నిమిత్తం రాత్రి అక్కడే ఉండడంతో ఇంటికి తాళం వేసిన విషయాన్ని గ్రహించిన గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. దీనిపై పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు.

నాటుసారా బట్టీ ధ్వంసం

యాడికి, సెప్టెంబరు2: మండలంలోని లక్షుంపల్లి గ్రామంలో సోమవారం నాటుసారా బట్టీని ధ్వంసం చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. లక్షుంపల్లి గ్రామశివారులోని కొండల్లో నాటుసారా తయారుచేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో దాడులు చేశామన్నారు. అందులో సారా తయారీ బట్టీని ధ్వంసం చేశామని, అలాగే సారా తయారుచేయడానికి సిద్ధంగా ఉంచిన 500లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని చెప్పారు. 10లీటర్ల సారాను సీజ్ చేసి కేసు నమోదుచేసినట్లు వివరించారు.

మండపాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలి

తాడిపత్రి, సెప్టెంబరు 2: వినాయక మండపాల ఏర్పాటుకు అన్నిశాఖల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని డీఎస్పీ జనార్ధన్‌నాయుడు సూచించారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో వినాయక ఉత్సవకమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండపాల నిర్వాహకులు ఆన్‌లైన్ ద్వారా పేర్లు నమోదుచేసుకోవాలన్నారు. ఆయాశాఖల అధికారులే స్వయంగా పరిశీలించి అనుమతులు ఇస్తారన్నారు. మండపాల వద్ద ఏ చిన్నపాటి గొడవలు జరిగినా నిర్వాహకులు పూర్తిబాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో సీఐ సాయిప్రసాద్, మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు అంకాల్‌రెడ్డి, శింగరి లక్ష్మినారాయణ, రంగనాథ్‌రెడ్డి, గంగాధర్, ఆంజనేయులు, రామాంజనేయులు పాల్గొన్నారు.

రాయదుర్గం: వినాయక చవితి సందర్భంగా మండపాలను ఏర్పాటు చేసేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఎస్పీ రవిబాబు సూచించారు. పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండపాల నిర్వాహకులు 7995095800కు వాట్సాప్ ద్వారా ఏదేని మెసేజ్ పెట్టగానే లింక్ వస్తుందని, ఆ లింక్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దీనికి సంబంధించి రుసుము కూడా చెల్లించి అగ్నిమాపక, పోలీసు, పురపాలక, విద్యుత్‌శాఖల ఏకకాలంలో అనుమతులు పొందవచ్చని తెలిపారు.

మహిళ ఆత్మహత్య



కుమారి (ఫైల్)

అనంతపురం క్రైం, సెప్టెంబరు 2 : అదనపు కట్నం వేధింపులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. టూటౌన్ సీఐ శ్రీకాంత్ తెలిపిన మేరకు... గుంతకల్లు పట్టణంలోని హౌసింగ్‌బోర్డుకు చెందిన సాకే కుమారి(26)కి గత ఏడాది ఆగస్టులో అనంతపురంలోని నవోదయకాలనీకి చెందిన మురళితో వివాహమైంది. కట్నం కింద 10తులాల బంగారు నగలు, రూ.4లక్షల నగదు ఇచ్చారు. అనంతరం ఆదర్శనగర్‌లో దంపతులు నివాసముండేవారు. మురళి బజాజ్ ఫైనాన్స్‌లో పని చేసేవాడు. గత కొంత కాలంగా భర్తతో పాటు అత్త రామలక్ష్మి, అత్త సోదరి రామక్క కుమారిని అదనపు కట్నం తేవాలంటూ వేధిస్తున్నారు. మనస్తాపానికి గురైన ఆమె సోమవారం ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లిదండ్రులు ఎరుకల రామాంజినమ్మ, వన్నూరప్పల ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

భవనంపై నుంచి పడి పెయింటర్ మృతి



దాసరి వినోద్ (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్, సెప్టెంబరు 2: పట్టణంలో పెయింటర్ వినోద్ (32) భవనంపై నుంచి పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానికంగా ఉన్న నారాయణప్ప, అరుణమ్మ దంపతుల కుమారుడు దాసరి వినోద్ పెయింటర్‌గా జీవనం సాగించేవాడు. కాగా సోమవారం స్టేట్ బ్యాంక్ వెనకాల భవనం మూడో అంతస్తులో పెయింటింగ్ పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రజాశ్రేయస్సు కోసం ఎల్ఐసీ కృషి

● జీఆర్పీ ఎస్పీ రాహుల్ మీనా

గుంతకల్లు, సెప్టెంబరు 2: ప్రజాశ్రేయస్సు కోసం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) ఎంతో కృషి చేస్తోందని ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్పీ) ఎస్పీ రాహుల్ మీనా పేర్కొన్నారు. ఎల్ఐసీ 68వ వార్షికోత్సవ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎల్ఐసీకి మరో సంస్థ పోటీ లేదన్నారు. కేవలం వ్యాపార దృక్పథంతో కాకుండా ప్రజా శ్రేయస్సు కోసం కృషిచేస్తున్న సంస్థ ఎల్ఐసీ అని అన్నారు. ఎల్ఐసీ సీనియర్ బ్రాంచ్ మేనేజరు మోహన్ నాయక్ మాట్లాడుతూ.. గుంతకల్లు బ్రాంచి రూ.250 కోట్ల వార్షిక టర్నోవర్‌తో దూసుకెళ్తోందన్నారు. అనంతరం సంస్థ రివాజును అనుసరించి వార్షికోత్సవం రోజున తొలి చెల్లింపు చేసిన బీమా ఖాతాదారుడికి సన్మానం చేశారు. కార్యక్రమంలో సహాయ మేనేజరు ఈరేశ్, పరిపాలక అధికారి ఇబ్రహీం, బీమా వ్యాపారాభివృద్ధి అధికారులు తారకేశ్వర్, శ్రీధర్, సీనియర్ ఏజెంటు మహానందీశ్వర రెడ్డి, సిబ్బంది, బీమా ఏజెంట్లు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు పౌష్టికాహారం తప్పనిసరి

● పౌష్టికాహార మాసోత్సవాల్లో ఐసీడీఎస్ సీడీపీఓ షాజిదాబేగం



వేములపాడు కేజీబీవీలో మాట్లాడుతున్న సీడీపీఓ

యాడికి, సెప్టెంబరు2: బాలికలు, మహిళలు రక్తహీనతకు గురికాకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ తాడిపత్రి సీడీపీఓ షాజిదా బేగం సూచించారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ఆమె మండలంలోని వేములపాడులో గల కేజీబీవీలో విద్యార్థినులకు రక్తహీనత వలన కలిగే అనారోగ్య సమస్యలపై వివరించారు. రక్తహీనతను నివారించడానికి పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. గుడ్లు, ఆకుకూరలు, కూరగాయలు, డ్రైఫ్రూట్స్ వంటివాటిని క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని కిశోర బాలికలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ నిర్మల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, వెలుగు ఏపీఎం చంద్రశేఖర్, పలువురు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలకేంద్రంలోని అంబేద్కర్‌కాలనీలో ఐసీడీఎస్ సిబ్బంది పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. పలువురు మహిళలకు రక్తహీనత పరీక్షలను నిర్వహించారు. రక్తహీనత నివారణపై అవగాహన కల్పించారు. కిశోర బాలికలు, మహిళలు తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది హేమావతి, రవణకుమారి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తాడిపత్రి: మండలంలోని గన్నెవారిపల్లికాలనీ అంగన్‌వాడీ సెంటర్‌లో పౌష్టికాహార మాసోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా వైద్యులు పలువురు మహిళలకు రక్తపరీక్షలు నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్త జ్యోతిలత మాట్లాడుతూ గర్భిణులు, కిశోర బాలికలు క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అలివేలమ్మ, సావిత్రి, సునీత, అనసూయ, అమ్మన్ని, ఆయాలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహార మాసోత్సవాల పోస్టర్ల విడుదల

కళ్యాణదుర్గంరూరల్: పట్టణంలో సోమవారం పౌష్టికాహార మాసోత్సవాల పోస్టర్లను ఆర్డీవో రాణి సుస్మిత, ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీప్రసన్న తదితరులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెలంతా అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహార మాసోత్సవాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దొణ గంగమ్మ జాతర



దొణ వద్ద పూజలు చేస్తున్న భక్తులు

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 2: మండలంలోని టీ వీరాపురం గ్రా మంలో దొణ గంగమ్మ జాతరను సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయాన్నే ఆలయంలోని అమ్మవారి మూలవిరాట్‌కు గంగాజలంతో అభిషేకం చేసి పట్టువస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించి కుంకుమార్చన చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. తర్వాత అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రథంలో కొలువుదీర్చి గ్రామ పురవీధులలో అశేష భక్తజనం మధ్య ఊరేగించారు. భక్తులు ఆలయం వద్ద ఉన్న దొణకు పూజలు చేశారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు గ్రామానికి చేరుకొని దొణ గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. గ్రామస్థులు ఆయన్ను పూలమాల, శాలువాలతో సత్కరించారు. జాతర సందర్భంగా గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. గాజులు, బొమ్మలు, తినుబండారాల దుకాణాలు విరివిగా వెలిశాయి. స్థానికులే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి జాతరలో పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి: సీపీఐ

ఉరవకొండ, సెప్టెంబరు 2: పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని సీపీఐ నాయకులు సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకూ ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలన్నారు. అలాగే ప్రజా పంపిణీ వ్యవస్థను మెరుగుపరచాలన్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరుగుతున్నా వాటిని అదుపుచేయడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైయ్యాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి నిత్యావసరాల ధరల నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సుల్తాన్, మల్లేష్, ప్రసాద్, తోపుడు బండ్ల యునియన్ నాయకులు చక్రధర్, హనుమంతు, ధనుంజయ, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి: నిత్యావసర ధరలను తగ్గించాలని కోరుతూ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం సీపీఐ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య, పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర ధరలను తగ్గించేందుకు ప్రభుత్వం చొరవచూపాలన్నారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. నాయకులు నాగరంగయ్య, శ్రీరాములు, రామాంజనేయులు, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

సుజాతమ్మకు ఎమ్మెల్యే నివాళి



సుజాతమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుత్తి, సెప్టెంబరు 2: పట్టణంలో కమ్మ సంఘం మండల మాజీ అధ్యక్షుడు కేశవనాయుడు సతీమణి సుజాతమ్మ గత ఆదివారం విద్యుదాఘాతంతో మృతిచెందిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోమవారం సుజాతమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అలాగే కేశవనాయుడిని పరామర్శించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్, మాజీ ఎమ్మెల్యే ఆర్ జితేంద్రగౌడ్, డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షురాలు పత్తిహిమబిందు, ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు నారాయణ, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కూడా నివాళులర్పించారు. పట్టణంలోని బండగేరిలో టీడీపీ సీనియర్ నాయకుడు కమలాకర్ ఆకస్మికంగా మృతిచెందాడు. ఎమ్మెల్యే వెళ్లి ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

ముగిసిన శ్రావణమాస బ్రహ్మోత్సవాలు



పుష్పాలంకరణలో ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్, సెప్టెంబరు 2: మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణ మాస బ్ర హ్మోత్సవ వేడుకలు సో మవారం అమావాస్యతో ముగిశాయి. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు, సంతోష్‌కుమార్ చార్యులు వేకువజామునే స్వామి మూ లవిరాట్‌కు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం చేసి విశేష అలంకరణ చేపట్టారు. అనంతరం విష్ణుపారాయణం, అష్టోత్తర పూజలు చేసి మహామంగళహారతి ఇచ్చి నైవేద్యం సమర్పించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ నరసింహారెడ్డి, మాజీ ధర్మకర్తలు కాశీనాథ్‌శెట్టి, శాంతయ్య, వన్నూరుస్వామి, టీడీపీ నాయకులు గాలి బసప్ప, బెళ్లి హనుమంత రెడ్డి, గాదిలింగ, ఎంపీటీసీ చిక్కణ్ణ పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయండి

రాయదుర్గం, సెప్టెంబరు 2 : బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 8800002024 నంబర్‌కు మిస్ కాల్ ఇచ్చి సభ్యత్వ నమోదు చేసుకోవచ్చన్నారు. మిస్‌కాల్ అనంతరం ఫోన్‌కు సభ్యత్వ నమోదు లింక్ వస్తుందని, అవసరమైన పత్రాలను అప్‌లోడ్ చేసి సభ్యత్వం పొందవచ్చనని చెప్పారు. దేశ భవిష్యత్తు కోసం బీజేపీకి మద్ధతు ఇవ్వాలన్నారు. గ్రామస్థాయి, బూత్‌స్థాయిలలో పర్యటించి అత్యధికంగా సభ్యత్వ నమోదు చేపడతామని పేర్కొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు ప్రశంసాపత్రం

తాడిపత్రి, సెప్టెంబర ు2: మున్సిపల్ కమిషనర్ శివ రామకృష్ణకు కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రశంసాపత్రాన్ని అందజేశారు. గత ఆగస్టు 31న జరిగిన పింఛన్ల పంపిణీలో తాడిపత్రి జిల్లాలో ప్రథమస్థానం, రాష్ట్రస్థాయిలో 4వస్థానంలో నిలిచింది. అందుకు విశేష కృషిచేసిన మున్సిపల్ కమిషనర్‌కు కలెక్టర్ ప్రశంసాపత్రాన్ని అందజేశారు. అనంతపురంలోని రెవెన్యూ భవనంలో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఈ ప్రశంసాపత్రాన్ని అందించారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

బొమ్మనహాళ్, సెప్టెంబరు 2: అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. మండలంలోని ఉద్దేహాళ్ వేదావతి హగరి నది నుంచి ఇసుకను ఆదివారం రాత్రి బళ్లారికి చెందిన డ్రైవర్ విరూపాక్షినాయక్ టిప్పర్‌లో అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామని ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. ఆంధ్ర సరిహద్దు వద్ద తనిఖీ చేయగా టిప్పర్ పట్టుబడిందన్నారు. వెంటనే స్వాధీనం చేసుకొని డ్రైవర్‌తో పాటు వాహన యజమాని రామకృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

దెబ్బతిన్న వేరుశనగ



వర్షానికి తడిసిపోయిన వేరుశనగ కట్టె

ఉరవకొండ, సెప్టెంబరు 2: నాలుగురోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వేరుశనగ పంట దెబ్బతింటోంది. ఇంద్రావతి గ్రామ పరిధిలో పలువురు రైతులు వేరుశనగ పంటను తొలగించారు. కాయలను తొలగించేలోగా వర్షం రావడంతో పంట మొత్తం తడిసిపోయింది. వేరుశనగ కట్టె కుళ్లిపోతోందని, కాయ లు నల్లబారి దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

మండలంలో తేలికపాటి వర్షం..

బెళుగుప్ప: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం తేలికపాటి వర్షం కురిసింది. రోజూ వర్షం కురుస్తుండటంతో నల్లరేగడి భూముల్లో సాగుచేసిన కందిపంటపై తీవ్ర ప్రభావం చూపుతుందని, అధిక తేమ అయితే నెలలోపు పైర్లు దెబ్బతింటాయని కంది రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి

ఉరవకొండ, సెప్టెంబరు2: పట్టణంలోని కాంగ్రెస్ నాయకులు సోమవారం ఉమ్మడి ఏపీ మాజీ సీఎం వైఎస్ రాజశేఖరెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక టవర్‌క్లాక్ కూడలిలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అలాగే కొనకొండ్ల, గూళ్యపాల్యం గ్రామాల్లో వైసీపీ శ్రేణులు వైఎస్ వర్ధంతిని నిర్వహించారు.

విడపనకల్లు: మండల కేంద్రంలో వైసీపీ నాయకులు వైఎస్ఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

పుట్లూరు: మండలకేంద్రంలో వైసీపీ మండల కన్వీనర్ నాగేశ్వరావు, సర్పంచ్ ఓబులేసు తదితరులు స్థానిక వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

యాడికి: మండలకేంద్రంలోని వైఎస్ విగ్రహానికి వైసీపీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, మాజీ జడ్పీటీసీ వెంకటరామిరెడ్డి, ఉప సర్పంచు చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కొండాపురంలో టీడీపీ నాయకుల పర్యటన

పామిడి, సెప్టెంబరు 2: పామిడి గ్రామ పంచాయతీలోని కొండాపురం గ్రామంలో సోమవారం గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్‌చౌదరి టీడీపీ శ్రేణులతో కలిసి శుభోదయం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వార్డుల్లో పర్యటించి ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నివేదిక తయారు చేసి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్‌తో చర్చించి పరిష్కరిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాస రెడ్డి, మాజీ ఎంపీటీసీ జింకల సంజీవకుమార్, నాయకులు ఆర్ఆర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కళ్యాణదుర్గంరూరల్, సెప్టెంబరు 2: కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని రూరల్ పోలీసులు పట్టుకున్నారు. కర్ణాటక నుంచి కూడేరుకు సోమవారం ఆటోలో 576 టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగా మండలంలోని బోరంపల్లి వద్ద పట్టుకున్నామని, ఇద్దరు వ్యక్తులను అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించామని, అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి

ఉరవకొండ, సెప్టెంబరు2: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. పలువురు మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్, యూపీ ఎస్‌లు వద్దని, పాత పెన్షన్ విధానం ఒక్కటే మెరుగైనదని అన్నారు. కనుక పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారు నరేష్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సాకే భాస్కర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఈపై చర్యలు తీసుకోవాలి

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు2: మున్సిపాలిటీలోని ఇంజనీరింగ్ సెక్షన్‌లో కార్మికులను వేధిస్తున్న ఏఈపై చర్యలు తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ నాయకులు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యకు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్మికులు విశ్రాంతి లేకుండా పనిచేస్తున్నారన్నారు. అయినా విధులకు సరిగా హాజరు కావడం లేదని వారిని ఏఈ వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఐఎఫ్‌టీయూ డివిజన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పవన్ కల్యాణ్ పుట్టినరోజు

● వేర్వేరుచోట్ల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరాం, జేసీ అశ్మిత్‌రెడ్డి, కాలవ శ్రీనివాసులు

గుంతకల్లు, సెప్టెంబరు2: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను పట్టణంలో సోమవారం జనసేన నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పాల్గొని స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కేక్ చేసి అందరికీ పంచారు. అలాగే పారిశుధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పవన్ పట్టుదల ఆదర్శప్రాయమన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ నేతృత్వంలో కూటమి పాలన అత్యుత్తమంగా కొనసాగుతోందన్నారు. అనంతరం హౌసింగ్ బోర్డు కాలనీలో మొక్కలను నాటారు. కసాపురంలో జనసేన నాయకుడు పూల రమణ పవన్ కళ్యాణ్ పేరిట అర్చన చేయించారు. టీడీపీ, జనసేన నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, నారాయణ, బండారు ఆనంద్, కృష్ణారెడ్డి, తలారి మస్తానప్ప, ఆంజనేయులు, అంజి, రాయల్ వెంకటేశులు, పూల రమణ, చిప్పగిరి ప్రతాప్, కొలిమి రామాంజనేయులు, శేకన్న, మంజులా వెంకటేశ్, విజయలక్ష్మి, గోవిందరాజులు పాల్గొన్నారు.

తాడిపత్రి: పట్టణంలో పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. స్థానిక తూర్పుపాలెంలోని తన నివాసం వద్ద వేడుకలను నిర్వహించారు. ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం అనంతపురం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 120మంది రక్తదానం చేశారు. తర్వాత ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవనుందని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు నరసింహ ఆచారి, కొండా శివ, బాబా, టీడీపీ నాయకులు హరినాథ్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం/ గుమ్మఘట్ట: పవన్‌కళ్యాణ్ జన్మదినం సందర్భంగా రాయదుర్గం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో రక్తదాన శిబిరాన్ని వాల్మీకి సేవాట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాలవశ్రీనివాసులుతో పాటు జనసేన ఇన్‌చార్జి మంజునాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పవన్ ఉప ముఖ్యమంత్రిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. ఆయన ఇలాంటి వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అలాగే గుమ్మఘట్ట మండలంలో బీటీపీ వద్దగల కేజీబీవీలో వారు మొక్కలునాటారు. తర్వాత గురుకుల పాఠశాలలో బాలికలకు పెన్నులు, ప్యాడ్‌లు పంపిణీ చేశారు. మండల కన్వీనర్ గిరిమల్లప్ప, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ కాలవ సన్నన్న, నాయకులు కేపీ దొడ్డి నాగరాజు, బేలోడు సంజీవ, దుర్గేష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉరవకొండ: మండలంలోని బూదగవి గ్రామంలో గల సూర్యనారాయణస్వామి ఆలయ ఆవరణలో జనసేన నాయకులు మొక్కలు నాటారు. అనంతరం సూర్యనారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత కేక్ కట్ చేశారు. వెలిగొండ గ్రామంలో పలు సేవాకార్యక్రమాలు చేపట్టారు. జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి గౌతమ్, నాయకులు చంద్రశేఖర్, కేశవ, గోపాల్, దేవేంద్రతదితరులు పాల్గొన్నారు.

కూడేరు: మండలకేంద్రంలోని సచివాలయంలో జనసేన, టీడీపీ శ్రేణులు కేక్ కట్ చేశారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటారు. మండల కన్వీనర్ నగేష్, స్కూల్ చైర్మన్లు జనసేన రాము, బోయరాము, నాయకులు బొమ్మినేనిశ్రీధర్, అంకెభీమ, బద్రీ, మసూద్ వలి తదితరులు పాల్గొన్నారు.

డీ.హీరేహాళ్: మండలకేంద్రంలోని శివలింగతాత మఠంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగళ్లి రాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం స్థానిక అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల ఆవరణలలో మొక్కలు నాటారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు శ్రీరాములు, జనసేన నాయకులు మల్లికార్జున, శరత్, వన్నూరుస్వామి, దేవా, సురేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలకేంద్రంలో సచివాలయంలో జనసేన నాయకులు కేక్ కట్‌చేశారు. జనసేన మండల కన్వీనర్ సుధీర్ శెట్టి, బీజేపీ మండల అధ్యక్షుడు వన్నూరుస్వామి, నాయకులు శేఖర్, అభి, మారుతిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు: మండలకేంద్రంలో జనసేన నాయకులు కేక్‌కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం మొక్కలు నాటారు. టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

యల్లనూరు: మండలకేంద్రంలోని వెనుకయ్యకాలువ రోడ్డులో జనసేన నాయకులు కేక్‌కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. పార్టీ మండల కన్వీనర్ ఆదినారాయణ, నాయకుడు మల్లేపల్లి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

యాడికి: మండలకేంద్రంలో జనసేన మండల కన్వీనర్ సునీల్ కేక్‌కట్ చేశారు. జనసేన నాయకులు జాకీర్, దస్తగిరి, శివ, వెంకటేష్, మధు ఆచారి తదితరులు మొక్కలు నాటారు.

గుత్తి: పట్టణంలోని రాజీవ్ సర్కిల్‌లో జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త వాసిగిరి మణికంఠ కేక్ కట్ చేసి, స్వీట్లను పంచిపెట్టారు. నాయకులు బోయగడ్డ బ్రహ్మయ్య, పాటిల్ సురేష్, వెంకటేష్, బండిసత్య పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో పవన్‌కళ్యాణ్ పేరిట జనసేన నాయకులు పూజలు జరిపించారు. కార్యక్రమంలో సికిందర్, బాషా, శివరామ్, ఖాదర్, ఆనంద్, రాజేష్, నవీన్, జ్ఞానమూర్తి తదితరులు పాల్గొన్నారు.



గుంతకల్లులో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే జయరాం



తాడిపత్రిలో వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి



బీటీపీ వద్ద గల కేజీబీవీ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కాలవ తదితరులు